నగరంలో కల్తీ పా"పాలు"

* శివారు ప్రాంతాల్లో యథేచ్ఛగా తయారీ
* అక్కడినుంచి క్యాన్లలోతెచ్చి సిటీలోఅమ్మకాలు
* అనారోగ్యం భారిన పడుతున్న ప్రజలు

హైదరాబాద్, మే 17,ప్రభాతవార్త: ఉదయం లేవగానే పసిపిల్లలు మొదలుకుని పెద్దవాళ్లవరకు ఎవరైనా ప్రత్యేకంగానో పరోక్షంగానో పాలు గానీ వాటి అనుసంధాన ఉత్పత్తులను గానీ తీసుకోవడం సర్వసాధారణం. "పాలు చాలా బలం, రోజుకు రెండు గ్లాసుల పాలు తాగితే నీకు నచ్చిన బొమ్మలు కొనిస్తా" అంటూ పిల్లలకు నచ్చజప్పి, బుజ్జగించి పాలు తాగిస్తారంతా. అది మంచిదే.. కానీ.. ఏ పాలు తాగిస్తున్నారు? చిక్కగా, తెల్లగా ఉన్నాయి, ప్యాకెట్ కూడా బాగుందని తక్కువ ధరకు కొన్నవేనా? ప్రముఖ బ్యాండ్లతో పోలిస్తే చాలాచవకగా దొరుకుతున్నాయని కొంటున్నారా? ఈ బలహీనతలనే క్యాష్ చేసుకుంటున్నరు కొందరు స్వార్థపరులు. ఈ పాలు పసిబిడ్డలు తాగుతారని తెలిసి కూడా స్వార్థంగా విక్రయిస్తూ పాపాలకు ఒడిగడుతున్నారు. రసాయనాలు, ఇతర పదార్థాలతో నకిలీ పాలు తయారుచేస్తూ మోసాలకు తెగబడుతున్నారు. మార్కెట్లో లభ్యమయ్యే ప్రముఖ డెయిరీల పాల ఉత్పత్తుల ధరతో పోలిస్తే సగం ధరకే విక్రయిస్తుండటంతో కొందరు వీటి వైపు మొగ్గుచూపుతున్నట్టు ఎస్వోటీ పోలీసు వర్గాలు చెబుతున్నాయి. చిక్కగా ఉంటాయని, నాణ్యమైనవి అంటూ వాటిని హోటళ్లకు, వినియోగదారులకు అంటగడుతున్నారు నిర్వాహకులు. హైదరాబాద్ నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో, రాజధాని చుట్టుపక్కల ఉన్న జిల్లాల్లోనూ ఈ తరహా పాల తయారీ, విక్రయాలు జరుగుతున్నాయని అనుమానిస్తున్న ఆవర్గాలు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నాయి. ముఖ్యంగా కల్తీ పాల తయారు చేయడానికి నీటిలో 5కిలోల యూరియాను కలుపుతారు. దీంతో పాలు తెల్లగా మారుతాయి. దానికి 250 గ్రాముల డిటర్జెంట్, కొంచెం రిఫైండ్ ఆయిల్ కలుపుతారు. కెమికల్ తయారు చేసిన పాల లాగ వాసన వచ్చే తెల్లటి పౌడర్ను కూడా మిక్స్ చేస్తారు. ఇలా తయారు చేసిన 40 లీటర్ల ద్రవంలో 60 లీటర్ల పాలు కలిపి 100 లీటర్ల కల్తీ పాలు తయారు చేస్తారు. ఇలా తయారుచేసిన పాలను గుర్తించడం సామాన్యులకు అసాధ్యమనే చెప్పాలి. దీంతో కల్తీరాయుళ్ల ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతుంది.

30 లక్షల లీటర్లలకుపైగా వినియోగం...

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నివసించే జనాభా కోటికి పైనే. రోజువారీ పాల అమ్మకాలు దాదాపు 30 లక్షల లీటర్లు. సహకార డెయిరీలు దాదాపు 10 లక్షల లీటర్లు విక్రయిస్తుండగా, ప్రైవేటు డెయిరీలు దాదాపు 18.19 లక్షల లీటర్లు అమ్ముతున్నాయి. కొందరు నకిలీ, కల్తీ పాలతో లక్ష లీటర్ల వరకూ విక్రయాలు సాగిస్తున్నారు. ప్రధానంగా మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి తదితర జిల్లాలతోపాటు నగరంలోని సికింద్రాబాద్, బోడుప్పల్, హయత్ నగర్ ప్రాంతాల్లో ఈ తరహా పాల తయారీ యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలున్నాయి. పలువురు రేకుల షెడ్లు అద్దెకు తీసుకొని నకిలీ పాల తయారీ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. సదరు ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు చిన్న చిన్న ఆటోలు, స్కూటర్లు, బైక్‌లద్వారా నిత్యం పాల సరఫరా అవుతుంది.దీంతో కొంతమంది అక్రమార్కులు కల్తీ పాలు తయారు చేస్తూ కాసులు గడిస్తున్నారు.

హైదరాబాద్ వార్త

ముష్కిన్ చెరువు అభివృద్ధికి ఆటంకాలు

17 రోజులు దాటినా గుడిసెలను ఖాళీ చేయించని రియల్టర్లు... ఖాళీ చేయించమని మరోసారి చెప్పిన హైడ్రా అధికారులు

హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త: "మీరంతా ముష్కిన్ చెరువు ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్) పరిధిలో ఉన్నారు. తాత్కాలిక షెడ్డుల్లో మిమ్ములను ఉంచి చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న భూములను కొట్టేయాలని రియల్టర్లు చూస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టిపోసి.. చెరువు స్వరూపాన్ని మార్చేశారు. ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను తెచ్చి చెరువు పరిధిలో వేస్తున్నారు. వ్యర్థాలు చెరువులోకి వదిలేస్తున్నారు. చెత్తను తగులబెట్టి చెరువును కలుషితం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న తాత్కాలిక షెడ్డులు(నివాసాలు), దుకాణాలను పెట్టించి.. వారి ఆక్రమణలకు అడ్డుగా మిమ్ములను ముందుంచుతున్నారు. చెరువు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఏప్రిల్ 29న ఇక్కడకు వచ్చాం.. 10 రోజుల్లో మీరంతా ఖాళీ చేయాలని సూచించాం. ఈ రోజు మే 16వ తేదీ అంటే 17 రోజులైంది. ఇందులో 10 శాతం మంది మాత్రమే ఖాళీ చేశారు. మీరు కూడా ఖాళీ చేస్తే ముష్కిన్ చెరువును అభివృద్ధి చేయాలి. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నారని గుడిసెలను ఖాళీ చేయించాలని ఈ భూమి తమదిగా చెబుతున్న వారికి కూడా 6 నెలల క్రితం చెప్పాం. మీకు ఆ సమాచారం వాళ్లు ఇవ్వడంలేదనే నేరుగా మీకు చెబుతున్నాం. 17 రోజులైనా మీరు ఖాళీ చేయడం లేదు. కోర్టు కూడా ఈ విషయంలో డ్యూ ప్రొసెస్ పాటించాలని సూచించింది. ఈ క్రమంలోనే ముందుగా మీకు తగినంత సమయం ఇచ్చాం.. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న తాత్కాలిక షెడ్డులను ఎప్పుడైనా తొలగిస్తాం. ఈ భూమి తమదిగా చెబుతున్న వారు టీడీఆర్ కింద నష్ట పరిహారం పొందే అవకాశం ఉంది. మీరే అనవసరంగా నష్టపోతారు ఖాళీ చేయాలి" అని హైడ్రా అధికారుల బృందం (హైడ్రా,రెవెన్యూ, ఇరిగేషన్) తెలిపింది.పనులకు వెళ్లినవారిని దృష్టిలో ఉంచుకుని శనివారం సాయంత్రం అక్కడ తాత్కాలిక షెడ్డులు వేసుకున్నవారిని కలిసి ఈ విషయాన్ని స్పష్టం చేసింది. గతంలో వచ్చి 10 రోజులు గడువు ఇచ్చినా.. మరో వారంరోజులు పెంచాం. కాని ఏమాత్రం మార్పు రాలేదు.. ఇప్పటికైనా ఖాళీ చేయండి.. ఒకటి రెండు రోజుల్లో ఎప్పుడైనా వచ్చి వాటిని తొలగిస్తామని అధికారులు వారికి చెప్పారు.

స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా అధికారులు

52.20 ఎకరాలు ముష్కిన్ చెరువు

ఎఫ్టీఎల్ చుట్టూ వేలాది నివాసాలు..

లక్షలాది మంది తిరిగాడే ప్రాంతంలో ఉన్న ఒక్కగానొక్క ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధిని హెచ్ఎండీఏ 52.20 ఎకరాలుగా గతంలోనే నిర్ణయించింది. బఫర్‌తోకలిపితే 62 ఎకరాల వరకూ ఉంటుందని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టి, చెత్త పోయడంతో కుంచించుకుపోయింది. ఇందులో పయనీర్స్ సంస్థ 18 ఎకరాల వరకూ తమదంటూ వాదిస్తూ వస్తోంది. రైతులకు చెందినది 12 ఎకరాల వరకూ ఉంది. వీటికి తోడు.. మరో 4.20 ఎకరాలు వేర్వేరు వ్యక్తులు క్లైమ్ చేస్తున్నారు. ఇలా మొత్తం 34.20 ఎకరాలు చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోనిదే అని హెచ్ ఎండీఏ లెక్కల ప్రకారం తేలుతుంది. శిఖం సర్కారీ ల్యాండ్ 21 ఎకరాల మేర ఉంది. గతంలో బఫర్ జోన్లో నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు కూల్చేశారు కూడా అయినా పట్టించుకోకుండా.. చెరువులో మట్టిని నింపుతూ ఎఫ్టీఎల్ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టడానికి బడా నిర్మాణ సంస్థ సిద్ధమౌతోంది. వరద నీరు రాకుండా కాలువలను మూసేసి నిర్మించిన ప్రహరీని అక్కడి స్థానికులు చూపించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో శిఖం పట్టాభూములుంటే అందులో వ్యవసాయం మాత్రమే చేసుకునే వెసులుబాటు ఉంది.అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని.. భూమి స్వరూపాన్ని మార్చకూడదనే నిబంధనలున్నాయి. ఇవేవీ పట్టించుకోకుండా మట్టి పోయడంతో చెరువు కుంచించుకుపోయింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో భూములకు నష్టపరిహారం పొందే అవకాశం ఉన్నా.. ఆదిశగా అక్కడి రైతులు, రియల్టర్లు ప్రయత్నించకుండా చెరువులో నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారు.చెరువును పూర్తి స్థాయి లో అభివృద్ధి చేస్తే ఇక్కడి పరిసరాలు ఆహ్లాదం గా మారుతాయి. భూగర్భ జలాలు పెరుగు తాయని అధికారులు చెప్పారు.

ఉద్యోగం రాలేదని మనస్థాపంతో

యువతి ఆత్మహత్య

జూబ్లీహిల్స్, మే 17, ప్రభాతవార్త : ఉద్యోగం దొరకక మానసిక ఆందోళనకు గురైన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భూషణ్‌గుప్తా(25) జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ బీఎస్ మక్తాలో నివాసం ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం మాలా సోన్‌వానీ అనే యువతిని ప్రేమించి ఛత్తీస్‌గఢ్‌లో వివాహం చేసుకున్నాడు. అనంతరం ఇద్దరూ హైదరాబాద్‌కు వచ్చి కలిసి జీవనం సాగిస్తున్నారు. మాలా సోన్‌వానీ(23) అప్పుడప్పుడు లోబీపీ సమస్యతో బాధపడేదని, అలాగే కుటుంబానికి ఆర్థికంగా సహాయం చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగం కోసం ప్రయత్నించినప్పటికీ ఉద్యోగం దొరకక మానసికంగా కలత చెందింది. విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్న భూషణ్, తలుపు తట్టినా భార్య స్పందించకపోవడంతో అనుమానం వచ్చి సమీపంలోని కిటికీ తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లగా, ఇంటి వెంటిలేటర్‌కు చున్నీతో ఉరేసుకుని మాలా సోన్‌వానీ వేలాడుతూ కనిపించింది. అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చార్మినార్, మే 17 ప్రభాతవార్త : ట్రాక్టర్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి రెయిన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పవన్ కుమార్ కథనం ప్రకారం... శనివారం రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో ఏసిపి కార్యాలయం నుంచి గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు.అదే సమయంలో డబీర్‌పుర వంతెన మీద నుంచి అతి వేగంగా వచ్చిన ట్రాక్టర్ రహదారి దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొట్టంది. ఈ సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. రెయిన్ బజార్ పోలీసులు మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్ర పరిచారు. పరారీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. రెయిన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒప్పంద కార్మికుడిపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 17, ప్రభాతవార్త : నిమ్స్‌లో కిడ్నీ మార్పిడి పేరుతో డయాలసిస్ రోగుల నుంచి డబ్బుల వసూలుకు పాల్పడిన నిమ్స్ ఒప్పంద ఉద్యోగి నాగరాజుపై పంజాగుట్ట పోలీసు ఠాణాలో కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. నిమ్స్‌లో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్న నాగరాజు నిమ్స్‌లో డయాలసిస్‌కు వచ్చిన మహ్మద్ సబీర్‌కు నెల రోజుల్లో కిడ్ని మార్పిడి ఏర్పాటుచేస్తానని హామినిచ్చి రూ. 2.50 లక్షలు ఖర్చవుతుందని అందులో భాగంగా రూ. 1.50 లక్షలు తీసుకున్నాడు. మరో డయాలసిస్ రోగి అంజాద్‌తో బాధితుడు మాట్లాడిన సమయంలో జీవన్‌దాన్ లేదా నిమ్స్ ఆసుపత్రి కిడ్నీ మార్పిడికి ఎలాంటి డబ్బులు తీసుకోదని గుర్తించాడు. దీంతో వ్యవహారం కాస్త బయటపడింది. ఈ మేరకు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నాగరాజుపై బీఎన్ఎస్ 316(2), 318(4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందు బాబులపై ట్రాఫిక్ పోలీసుల కొరడా

రెండు రోజుల్లో 474 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్, మే 17,ప్రభాతవార్త: మద్యం తాగి వాహనం నడపడం చాలా ప్రమాదకరమైన చర్య. మన మస్తిష్కాన్ని, నాడీ వ్యవస్థను క్రమంగా ప్రభావితం చేస్తుంది. ఇదిమన అవగాహనను తగ్గించి, మనం తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. అందుకే మద్యం తాగి వాహనాన్ని నడపవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ కొందరు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు గత రెండు రోజుల పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మొత్తం 474 మంది డ్రైవర్లు పట్టుబడ్డారని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 417 మంది ద్విచక్ర వాహనదారులు (టూవీలర్స్), 24 మంది త్రీవీలర్ల నిర్వాహకులు, అలాగే 33 మంది ఫోర్‌వీలర్లు మరియు ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారని తెలిపారు. తనిఖీల సమయంలో నమోదైన బ్రీత్ అనలైజర్ స్థాయిల వివరాలు 30 నుంచి 50 103 కేసులు, 51 నుంచి 100 188 కేసులు,101 – 150 100 కేసులు, 151– 200 44 కేసులు, 201– 250 19 కేసులు, 251 –300 8 కేసులు 300 అంతకంటే ఎక్కువ 12 కేసులు నమోదైనట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారు, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండేది లేదని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు, నగర ప్రజలు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నాయకులతో కిషన్‌రెడ్డి

అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి

కార్వాన్, మే17(ప్రభాతవార్త) : నాంపల్లి నియోజక వర్గం పరిధిలోని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆసిఫ్‌నగర్‌లోని సీతారాంబాగ్,న్యూ ఇందిరానగర్‌లోని వడ్డేర స్మశాన వాటికలో గది నిర్మాణం,ప్లాట్‌ఫారమ్‌పై షెడ్,స్మశానవాటిక చుట్టూ సిసి ఫ్లోరింగ్, మరుగుదొడ్ల మరమ్మతులు మరియు ప్రహరీ గోడ నిర్మాణం,రెడ్‌హిల్స్ డివిజన్‌లోని చింతల్‌బస్తీ గ్రంథాలయం గ్రౌండ్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అహ్మద్ నగర్ డివిజన్‌లోని డా. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో మొదటి అంతస్తు భవన నిర్మాణం పనులను పరిశీలించారు.ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ.. బండి భగీరథ్ వ్యవహారంపై స్పందిస్తూ బండి భగీరథ్ ప్రస్తుతం పోలీసులకు లొంగిపోయాడని, ఇప్పుడు విచారణ మొత్తం రాష్ట్ర పోలీసుల చేతిలోనే ఉందని.రాష్ట్ర ప్రభుత్వానికి స్వతంత్ర వ్యవస్థ అని ఈ కేసు విషయంలో పోలీసులు ఎలాంటి విచారణ అయినా చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంపై ధాన్యం కొనుగోలు వ్యవహారంలో తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ధాన్యం కొనుగోలుకు కేంద్రం ప్రతి పైసా ఇస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులూ రాములు,క్రాంతి,సాయి సతీష్, రాహుల్ చంద్ర, దేవర వంశీ, ధర్మేందర్ సింగ్, రజని, బుజంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిరక్షణలో బిఎల్ఏ పాత్ర కీలకం

బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్

వనస్థలిపురం, మే 17 ప్రభాతవార్త : ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని హస్తినాపురం డివిజన్‌లో గల జీఎస్ఆర్ హాల్‌లో ఎల్‌బీ నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ స్థాయి ప్రతినిధుల శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటి రామారావు ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రధాని మోదీని ఒక్కటే అడుగుతున్నా ఇవాళ మీరు బేటి బచావో బేటి పఢావో అంటున్నారు. కేవలం నినాదానికే పరిమితమైతే న్యాయం జరుగదు మోదిగారు అన్నారు. దేశంలో ఒక కేంద్ర మంత్రి కొడుకు మీద లుకౌట్ నోటీసులు జారిచేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఇది తెలంగాణాకే కాదు దేశానికి అవమానకరం అన్నారు. బీఆఎస్ పార్టీ బలోపేతం,ఓటరు జాబితా పరిరక్షణలో బూత్ స్థాయి ప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించడం, కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టడం, తప్పులు, ఒకే వ్యక్తి పేర్లు పలుమార్లు నమోదైన అంశాలను గుర్తించడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్వహించే ప్రత్యేక సర్వేలు, సవరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రతి అర్హత కలిగిన ఓటరుకు న్యాయం జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలకు ఓటరు జాబితా నిర్వహణపై పూర్తి అవగాహన ఉండటం పార్టీ మరింత బలోపేతానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ముట్ట గోపాల్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, ఉద్యమకారులు,వివిధ విభాగాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

జూ పార్కును తిలకించిన 20 వేల మంది

చార్మినార్, మే 17 ప్రభాతవార్త : పాతబస్తీలోని పర్యాటక స్థలాలను ఆదివారం వేలాది మంది సందర్శకులు తిలకించారు.విద్యా సంస్థలకు సెలవులు కావటంతో జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలు నుంచి పర్యాటకులు చారిత్రక చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జులాజికల్ పార్కును చూడటానికి వచ్చారు.వేలాది మంది సందర్శకులు చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియంను తిలకించటానికి రావటంతో పరిసర ప్రాంతాలలో విపరీతమైన రద్దీ ఏర్పడింది.నెహ్రూ జూలాజికల్ పార్కును దాదాపు ఇరవై వేల మంది పర్యాటకులు ఆదివారం సందర్శించారు.జూ పార్కు అధికారులు సందర్శకులకు ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉచిత ప్రవేశం

చార్మినార్, మే 17 ప్రభాతవార్త : అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా మే 18వతేదీన సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నామని మ్యూజియం కీపర్ బి.ఆర్.నాయక్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలు నుంచి రాత్రి ఎనిమిది గంటలు వరకు సాలార్‌జంగ్ మ్యూజియం తెరిచి ఉంటుందని ఆయన తెలియజేశారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్

సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌ను నిర్వహించనున్నామని మ్యూజియం కీపర్ ఆర్.బి.నాయక్ తెలిపారు. ప్రతీ సంవత్సరం వేసవి కాలంలో జంట నగరాలలోని విద్యార్థులకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నామని, నూటయాభై మంది విద్యార్థులు సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌లో పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌లో శిక్షణ ఇవ్వనున్నారని ఆయన తెలిపారు.

కెబిఆర్ పార్క్ చుట్టూ..గ్రేడ్ సెపరేటర్ కారిడార్

కాంక్రీట్‌కు బదులుగా స్టీల్ ఫ్లైఓవర్ల నిర్మాణం

ప్రాజెక్ట్‌పై వీడియో రిలీజ్ చేసిన జీహెచ్ ఎంసీ

హైదరాబాద్, మే 17 ప్రభాతవార్త : సిటీలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు చేపట్టిన ప్రాజెక్టు పనులు జీహెచ్ఎంసీ వేగవంతం చేసింది. ఆదివారం కేబీఆర్ పార్క్ చుట్టూ నిర్మించే గ్రేడ్ సెపరేటర్ కారిడార్ ప్రాజెక్ట్ పై వీడియో రిలీజ్ చేసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, రోడ్ నంబరు 45, జూబ్లీ చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు కేబీఆర్ పార్క్ చుట్టూ భారీ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. కేబీఆర్ పార్క్ ఎకో సెన్సిటివ్ జోన్‌కు ఎలాంటి నష్టం లేకుండా ఈ నిర్మాణం చేపట్టనున్నారు. జీరో పార్క్ ఇంట్రూజన్‌తో రోడ్డు మీడియన్స్ లోనే ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించనున్నారు. ప్రాజెక్ట్ కోసం కేబీఆర్ పార్క్‌లోని ఒక్క చెట్టును నరకబోమన్న అధికారులు స్పష్టం చేశారు. కాంక్రీట్‌కు బదులుగా స్టీల్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. స్టీల్ నిర్మాణాలతో పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉందని నిర్మాణ సమయంలో ట్రాఫిక్ కు అంతరాయం ఉండకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. సెంట్రల్ మీడియన్‌లోఉన్న చెట్లను ట్రాన్స్ ప్లాంటేషన్ ద్వారా సురక్షితంగా తరలించనున్నారు. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ నుంచి ఫిలింనగర్ వరకు సిగ్నల్ ఫ్రీ కారిడార్‌గా మార్చబోతున్నట్టు చెప్పారు. రోడ్ నెం.45, ఫిల్మ్ నగర్, క్యాన్సర్ హాస్పిటల్, ముగ్ధా జంక్షన్లు కలిపే ఈప్రాజెక్టు పూర్తయితే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో వాయు కాలుష్యం 72 శాతం వరకు తగ్గే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ తగ్గడంతో 40 కోట్ల లీటర్లకుపైగా ఇంధన ఆదా అవుతుందన్నారు. 13.66 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల నియంత్రణ లక్ష్యంగా జూబ్లీహిల్స్–మాదాపూర్ ప్రయాణ సమయం గణనీయంగా తగ్గించేందుకు ఈప్రాజెక్టు లక్ష్యంగా పెట్టుకున్నారు.అభివృద్ధి, పర్యావరణ సమతూకంతో గ్రీన్ హైదరాబాద్ లక్ష్యంగా ప్రాజెక్ట్ కొనసాగింపు ఉంటుందని జీహెచ్ ఎంసీ అధికారులు తెలిపారు.

ఉప్పల్‌లో దారి మళ్లింపుతో వాహనదారుల ఇక్కట్లు..!

పట్టించుకోని ఎంఎంసి అధికారులు

పోలీసులకు తప్పని యాతన

ఉప్పల్, మే 17 ప్రభాతవార్త : ఉప్పల్ చౌరస్తాలో ఆదివారం నుంచి ట్రాఫిక్ దారిమళ్లింపు చేపట్టడంతో వాహనదారుల తీవ్ర ఇక్కట్లు పడ్డారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గత నెల రోజుల నుంచి ట్రాఫిక్ దారి మళ్లింపు ఉంటుందని ప్రకటించినా ప్రత్యామ్నాయ రహదారులు పూర్తి స్థాయిలో తీర్చిదిద్దకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వరంగల్ జాతీయ రహదారి మూసివేయడంతో కాలనీ రోడ్లు, చిన్న చిన్న గల్లీల వెంట ఆర్టీసీ బస్సులు, లారీలు ప్రయాణించాయి. దీంతో పలువురు కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు రోడ్డు మూసివేస్తామని గత నెల రోజుల నుంచి ప్రకటిస్తున్నా ప్రయత్నామ రహదారులను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దలేదు. దీంతో దూర ప్రాంత ప్రయాణికులు అవస్థలకు గురైయ్యారు. ఉప్పల్ చౌరస్తా వద్ద పూర్తి స్థాయిలో మూసివేయగా, వరంగల్ నుంచి వచ్చే ప్రయాణికులు చౌరస్తా వరకు వచ్చి వెంకటేశ్వర కాలనీ మీదుగా నాగోల్ వైపు వెళ్లారు. ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా వద్ద రోడ్డును పూర్తిగా మూసివేశారు. దీంతో కాలనీల నుంచి వచ్చే వాహనదారులు సుమారు కిలో మీటరు దూరం తిరిగి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

ట్రాఫిక్ పోలీసులు యాతన...

ఉప్పల్‌లో చాలా రహదారుల వద్ద వాహనదారుల ఇష్టారాజ్యంగా ప్రయాణించడంతో ట్రాఫిక్ పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర అవస్థలుపడ్డారు. వాహనదారులు కూడా పోలీసులు సూచనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వాహనాలను రహదారుపైకి తీసుకుని వచ్చారు. పలు కాలనీల మీదుగా బోర్డులు ఏర్పాటు చేసినా పట్టించుకోకుండా రహదారిపైకి రావడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. పలు చోట్ల చౌరస్తాలపై పోలీసులను నియమించినా వారి సూచనలు చాలా మంది బేఖాతరు చేశారు. ఎక్కడ పడితే అక్కడ రోడ్ల వెంట వాహనాలు నిలిచిపోయి కనిపించాయి.

ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే...

వరంగల్ నుండి హైదరాబాద్ వెళ్లే వాహనదారులు మే ఫీల్ హోటల్ దాటిన తర్వాత ఉప్పల్ భగాయత్ ద్వారా నాగోల్ వెళ్లి, సర్వీస్ రోడ్డు ద్వారా వెళ్లి ఫ్లైఓవర్ కింద యూ టర్న్ తీసుకొని హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. హైదరాబాదు నుండి వరంగల్ వెళ్లే వాహనదారులు సర్వే ఆఫ్ ఇండియా జంక్షన్ వద్ద పిస్తా హౌస్ పక్క నుండి బీరప్ప గడ్డ మీదుగా వెళ్లి జాతీయ రహదారి 163 మీదుగా వరంగల్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

ఉప్పల్ భగాయత్ రోడ్డు చాలా చిన్నగా ఉన్నందున హైదరాబాద్, వరంగల్ బస్సులు, లారీలు ఒఆర్ఆర్ మీదుగా ప్రయాణించాలని సూచించారు. హైదరాబాదు నుండి వరంగల్ వెళ్లే వాహనదారులు ఎల్బీనగర్, హయత్‌నగర్ ఒఆర్ఆర్ మీదుగా ఘట్కేసర్ నుండి వరంగల్ వెళ్లాలని కోరారు. ప్రజలు ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా పోలీసు శాఖ, సంబంధిత అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

ఉప్పల్ చౌరస్తాలో మూసివేసిన వరంగల్ జాతీయ రహదారి

వరంగల్ రహదారిలో ట్రాఫిక్ రద్దీ దృశ్యం

మంత్రి సీతక్కని కలిసిన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, కార్యవర్గం

మంత్రి సీతక్కను కలిసిన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్

బేగంపేట, మే 17, ప్రభాతవార్త : రాష్ట్ర పంచాయితీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను ఆదివారం రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, నూతన కార్యవర్గంతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసారు. నూతనంగా నియమితులైన ఛైర్‌పర్సన్, సభ్యులకు మంత్రి సీతక్క శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా గద్వాల విజయలక్ష్మి మంత్రి సీతక్కను సత్కరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలకు, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కమిషన్ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళల సమస్యలపై సత్వరమే స్పందించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఛైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి తెలియజేసారు.

కాంగ్రెస్ పార్టీ బేగంపేట డివిజన్‌గా అధ్యక్షుడిగా మహ్మద్ నసీర్

బేగంపేట, మే 17, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం డివిజన్ అధ్యక్షుల జాబితాను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్‌కుమార్‌గౌడ్ విడుదల చేసారు. బేగంపేట డివిజన్ అధ్యక్షుడిగా మహ్మద్ నసీర్ (అడ్డూ) నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఆయన ఎంతో కాలంగా సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు విశాల్‌సుధాం, పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డా. కోట నీలిమ, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్‌ల సహకారంతో అడ్డూ బేగంపేట డివిజన్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భం గా మహ్మద్ నసీర్(అడ్డూ) మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రాంగోపాల్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా త్రికాల...

బేగంపేట, మే 17 ,ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ రాంగోపాల్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా త్రికాల మనోజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్షుడిగా నియమించిన టీపీసీసీ ఛీఫ్ బి.మహేష్‌కుమార్‌గౌడ్, దీపక్‌జాన్, కోట నీలిమలకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

క్రీడలలో ప్రతిభచూపిన క్రీడాకారులకు అభినందనలు

క్రీడలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో అధ్యాపకులు

బేగంపేట, మే 17, ప్రభాతవార్త : జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో ప్రతిభ చూపిన విద్యార్థులను బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యావారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ టి.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డా. సుప్రియా పుంజాల ఆధ్వర్యంలో వివిధ క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను అధ్యాపకులు శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. అధ్యాపకులు ప్రొ.శారద, శ్రీనివాస్, ఇలాయట్, అఫ్సర్ ఉన్నీసా బేగం, ఎమ్.పద్మకుమారి, డా.కె.వెంకటేశ్వర్లు, డా. డి.సరిత, డా.సునీత, డా.నందిని, డా.కల్పన, డా.పర్వీన్ సుల్తానాలు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు, అధ్యాపకులు క్రీడా విభాగాధిపతి డా. సుప్రియా పుంజలకు సన్మానం చేసారు.

నానీ మధుతారకలు కవితా సంపుటి పుస్తకావిష్కరణ

నానీ మధుతారకలు కవితాసంపుటినిఆవిష్కరిస్తున్న ఎన్.గోపి తదితరులు

రవీంద్రభారతి, మే 17 ప్రభాతవార్త : యువకవి బండ్ల తారకేష్ రచించిన నానీ మధుతారకలు మిణుకులతో తొణికే భావుకతా సౌరభాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య డా. ఎన్.గోపి అన్నారు. ఇవి మానవత, సామాజికత, కవితాత్మకతలు ముప్పేటగా అల్లుకున్న అపురూప రచనలని, నానీల ప్రపంచంలోకి మరో విలువైన చేర్పని అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. ఎస్.రఘు సభాధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య డా. ఎన్.గోపి ఆత్మీయ అతిథులు కుడికాల వంశీధర్, సజ్జా వెంకటేశ్వర్లు, డా. గిన్నారపు ఆదినారాయణ, వి.వి.ఎస్.రమణ, బండ్ల మాధవి తదితరులతో కలిసి యువకవి బండ్ల తారకేష్ రచించిన నానీ మధుతారకలు నానీల కవితా సంపుటిని ఆవిష్కరించి తొలిప్రతిని బండ్ల మాధవిని ఘనంగా సన్మానించి అందజేశారు. అనంతరం రచయిత బండ్ల తారకేష్‌ను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.

మున్సిపల్ అధికారులా? లేక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా?

బిఆర్ఎస్ నేత, న్యాయవాది సిందం శ్రీకాంత్

కెపిహెచ్‌బి కాలనీ, మే 17, ప్రభాతవార్త : గత ఫిబ్రవరి 10వ తేదీన జిహెచ్‌ఎంసి కార్పొరేటర్ల పదవీకాలం ముగిసిపోయింది. అయినాసరే నిబంధనలకు విరుద్ధంగా ఇంకా కార్పొరేటర్ పదవిలో ఉన్నట్టు హైదర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నార్నె శ్రీనివాస్ వ్యవహరిస్తున్నాడని, డివిజన్ ప్రాంతంలో తిరుగుతూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్టు భుకాయిస్తూ, ఫొటోలకు ఫోజులిస్తూ డివిజన్ ప్రజలని మభ్యపెట్టే ప్రయత్నం చూస్తున్నాడని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు న్యాయవాది సిందం శ్రీకాంత్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌కి మున్సిపల్ అధికారులు కొందరు వత్తాసు పలుకుతూ ఉన్నారని బాధ్యత కలిగిన కార్పొరేషన్ ఉద్యోగాలు ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం డిఈలు మౌనిక, శంకర్ గణేష్ కొందరు మున్సిపల్ సిబ్బంది ఆయనతోపాటు పర్యటనలు చేయడం కరెక్ట్ కాదని, ఇది ముమ్మాటికి అధికార దుర్వినియోగం ప్రొటోకాల్ ఉల్లంఘనని ఆయన విమర్శించారు. పదవి కాలం ముగిసిపోయిన కార్పొరేటర్‌తో తిరుగుతున్న ఆల్విన్ కాలనీ సర్కిల్ మున్సిపల్ ఉద్యోగులు ఏ ప్రొటోకాల్ ప్రకారం పదవి కోల్పోయిన మాజీ కార్పొరేటర్‌తో తిరుగుతున్నారో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలా మున్సిపల్ సిబ్బంది కొందరు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా వ్యవహరించడం సిగ్గుచేటని ఆయన తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇకనైనా ఇలాంటి పద్ధతులు మానుకోవాలని లేకపోతే, ప్రొటోకాల్ ఉల్లంఘన విషయాలపైన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని ఇలాంటి భవిష్యత్తులో జరగకుండా చూసుకోవాలని న్యాయవాది సిందం శ్రీకాంత హెచ్చరించారు.

మాదక ద్రవ్య నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్



మన ఇల్లు మన బస్తిని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి

ఎల్.బి.నగర్, మే 17 ప్రభాతవార్త: మాదకద్రవ్య నివారణలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని యువతను మంచి మార్గంలోకి తీసుకువెళ్లాలని టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీమంత్రి కేటీఆర్, మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు ఇంద్రాల చంద్రశేఖర్‌ఆజాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మన ఇల్లు మనబస్తి, మనఊరు మనబాధ్యత, మత్తుపదార్థాల నివారణకు సంబంధించి అవగాహన కార్యక్రమానికి సంబంధించిన భారీపోస్టర్‌ను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడి భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజ నిర్మాణం కోసం ముందుకు సాగాలని అందుకు యువత నడుం బిగించాలన్నారు. మనఇల్లు, మనబస్తి, మన ఊరు, మనబాధ్యత, ఇంటింటి ప్రచారం సామాజిక అవగాహన కార్యక్రమాన్ని చంద్రశేఖర్‌ఆజాద్ ఆధ్వర్యంలో జిహెచ్‌ఎంసి శానిటరీ హెచ్‌ఎండబ్ల్యుఎస్, పోలీస్‌విభాగం, స్పెషల్‌డ్రైవ్ నిర్వహించడం పట్ల వారు అభినందించారు. పచ్చదనం పరిశుభ్రత, తడిపొడి చెత్తను వేరుచేద్దాం, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను నిర్మూలిద్దాం కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. సుజలాం సుఫలాం, జలసంరక్షణ, నీటిని కాపాడుకుంటే మనల్ని మనం కాపాడుకున్నట్లే, ప్రతినీటి బొట్టును ఆదాచేయాలని,ప్రతిఇంటికి ఇంకుడుగుంత ఏర్పాటు చేయాలని, భూగర్భ జలాలను పెంచాలన్నారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల నివారణ, మత్తుపదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక ఇబ్బందుల తోపాటు సామాజికపరమైన నష్టం జరుగుతుందన్నారు. మాదకద్రవ్యాల విక్రయాన్ని అరికట్టేందుకు కార్యక్రమం రూపొందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని, చెడుస్నేహాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒక్కసారి మత్తుకు బానిసైతే భవిష్యత్తు పూర్తిగా అంధకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ తీగల అనితరెడ్డి, తోట మహేష్‌యాదవ్, లింగాల రాహుల్‌గౌడ్, జీవి.సాగర్‌రెడ్డి, ఉదయ్‌గౌడ్, తాళ్ల శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంచివారి తప్పులే విపత్తుకు కారణం

తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు రమణాచారి

నాంపల్లి, మే 17 ప్రభాతవార్త : కుటుంబంలోని అందరూ మంచివారే కానీ ఆ మంచివాళ్లు చేసిన తప్పులే మహా విపత్తులకు కారణమవుతాయని నిరూపిస్తున్న గొప్ప సందేశాత్మక నాటకమే అందరూ మంచివారే కానీ ... అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి తెలిపారు. ఈమేరకు రసరంజని హైదరాబాద్ వారు ప్రతినెలా నాటకం–ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం–అదే మాబాట, మామాట నినాదంతో మే 21 గురువారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో రాత్రి 6.45గంటల నుండి ప్రదర్శించనున్న అందరూ మంచివారే కానీ... నాటకం బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. జరుగుల రామారావు రచన దర్శకత్వంలో, మానవత–యడ్లపాడు (పల్నాడు జిల్లా) వారి నిర్వహణలో ప్రదర్శించనున్న ఈ సందేశాత్మక నాటకంలో ప్రధానపాత్రల్లో ఆర్. రాజేశ్వరి, ఎస్ఎస్.పూజిత, ఎం.పద్మారావు, ఎన్.సూర్య,జరుగుల రామారావు ఆయా పాత్రల్లో నటించనున్నట్లు వివరించారు. ఈ ప్రదర్శనకు అధికసంఖ్యలో నాటకప్రియులు, ఔత్సాహికప్రేక్షకులు విచ్చేసి నాటకాన్ని ఆసాంతం తిలకించి రంగస్థల రంగాన్ని, కళాకారులను ప్రోత్సహించాలని రమణాచారి కోరారు.

నేడు శ్రీమద్భగత్ రామానుజ సిద్ధాంత పీఠం ప్రారంభం

రవీంద్రభారతి, మే 17 ప్రభాతవార్త : శ్రీమద్భగవద్రామానుజ సిద్ధాంత పీఠం, హైదరాబాద్ ప్రారంభోత్సవం జరుపుతున్నట్లు అధ్యక్షుడు డా. చెన్నమనేని హనుమంతరావు తెలిపారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో 18 సోమవారం రాత్రి 6గంటలకు పరమహంస పరివ్రాజకాచార్య త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి అధ్యయన కేంద్రం శుభారంభం కావించనున్నట్లు ఆయన తెలిపారు. డా. సముద్రాల వెంకటరంగ రామానుజాచార్య స్వామివారి అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా సాతులూరి గోపాలకృష్ణమాచార్యస్వామి, కండ్లకుంట నరసింహాచార్య స్వామి, శ్రీమాన్ డా. కె.వి.రమణాచార్య స్వామివారు హాజరు కానున్నట్లు హనుమంతరావు పేర్కొన్నారు. ఈ పీఠం ముఖ్యోద్దేశం... దీనిని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధ సంస్థగా ఏర్పాటు చేసి ఈ సంస్థ ద్వారా శ్రీ వైష్ణవ సిద్ధాంతంలో సర్టిఫికెట్ డిప్లమా, డిగ్రీ, పీజి వంటి కోర్సులను పూర్తిచేసి సర్టిఫికెట్ పొందే అవకాశం ఉంటుందని విన్నవించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ ఆల్ బిల్డింగ్ వర్కర్స్ యూని యన్ అధ్యక్షులు చెన్నగల రాం చంద్రయ్య

అత్తాపూర్, మే 17 ప్రభాతవార్త : లేబర్ కార్డుతో ప్రభుత్వ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆల్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చెన్నగల రాం చంద్రయ్య తెలిపారు.శివరాంపల్లిలో ఆదివారం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు రక్షణ పరమైన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్కర్స్ సంక్షేమం కోసం యూనియన్ అవిరాళంగా కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రతి కార్మికుడు తప్పకుండ యూనియన్ సభ్యత్వం తీసుకోవాలని,కార్మికులకు ఏ ఆపద వచ్చిన, ప్రమాదం జరిగిన వారికి యూనియన్ అన్ని విధాల అండగా ఉంటుందని ఆయన తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి ఎన్.యాదగిరి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి రవీందర్‌రెడ్డి, యూనియన్ నాయకులు జంగయ్యయాదవ్, ఆదిరాల రవి కుమార్,పి.శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిన టిడిపి నేతలు

సికింద్రాబాద్, మే 17 ప్రభాతవార్త: ఆదివారం హైదరాబాద్ జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి నేతలు బౌద్ధనగర్ నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. సికింద్రాబాద్ ఇంచార్జి వల్లారపు శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యాక్రమంలో నేతలు పరిటాల విజయ్ కుమార్, జీవి కృష్ణ, చిరంజీవిరాజు, శశిరేఖ, పూజా, పిట్ల శంకర్ ముదిరాజ్, వెంకటస్వామి, జగదీష్, మురళి, చందర్‌ముదిరాజ్, చంద్రమోహన్, రాహుల్, శ్రీను, సుధాకర్, దేవేందర్, సాయి, శ్రీను పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి నుంచి...

టీడీపీ సీనియర్ నేతలు మినీ మహానాడులో పాల్గొనేందుకు భారీగా తరలి వెల్లారు. బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్, గండికోట విజయ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, వినోద్, విజయ్‌కుమార్, శివకుమార్, గిరిబాబు, సత్తి, జీఎం రమేష్, రామ్‌చరణ్‌లతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీచేస్తున్న పెరిక సురేష్ తదితరులు

వేసవిలో ప్రజలకు ఊరటనిచ్చేలా మజ్జిగ పంపిణీ

హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త: ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు నమో వందే గోమాతరం, వరల్డ్ హిందూ లయన్స్ ఫౌండర్ ప్రెసిడెంట్ పెరిక సురేష్ వెల్లడించారు. సంస్థల ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పెరిక సురేష్ మాట్లాడుతూ, వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిరంతరంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సేవా కార్యక్రమంలో ప్రతిరోజూ వేలాది మందికి చల్లని మజ్జిగ అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వడదెబ్బ నివారణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా తరచుగా లిక్విడ్స్ తీసుకోవాలని, బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కుంభాభిషేకం

ననయనమనోహరంగా డోలోత్సవం

చాంద్రాయణగుట్ట, మే 17, ప్రభాతవార్త :

పాతబస్తీ గౌలిపురా శ్రీరాంనగర్ కాలనీలోని బతుకమ్మ బావివద్దగల లక్ష్మీ నారాయణస్వామి, రాజరాజేశ్వరీ దేవస్థానంలో ఆదివారం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వసంతోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఎం.వి.శేషాద్రి అయ్యంగార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆరాధన, బాలభోగం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి 108 కళశ జలాలతో కుంభాభిషేకం, వసంతోత్సవాన్ని జరిపించారు. ఉభయ దేవేరులతో ఆశీనులైన స్వామివారి డోలోత్సవం నయనమనోహరంగా జరిగింది. మహిళలు స్వామి ఊయలను ఊపుతూ భక్తి గీతాలు ఆలపించారు. ఆ తరువాత స్వామి వారికి చక్రస్నానం, మధ్యాహ్నం పుష్పార్చన పూజలు చేపట్టారు. నిర్వాహకులచే భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. నగరంలోని పలు ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కుంభాభిషేకం, వసంతోత్సవం, చక్రతీర్థం పూజలను ఎంతో భక్తిప్రపత్తులతో తిలకించారు. ఆలయంలో శ్రీ లక్ష్మీనారాయణస్వామి, శ్రీ రాజరాజేశ్వరి దేవిని దర్శించుకొని సేవించారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని మామిడి ఆకులు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.



నారాయణుని డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు అమలుకు

సిఎం ఆదేశాలు జారీ చేయాలి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల కాపీలను ప్రదర్శిస్తున్న అసోసియేషన్ ప్రతినిధుల

సైఫాబాద్, మే 17 ప్రభాతవార్త: హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం గుట్టల బేగంపేటలోని సియెట్ మారుతి హిల్స్ కాలనీలో ఎలాంటి తవ్వకాలు,పనులు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని ఆ కాలనీ రెసిడెంట్స్, వెల్ఫేర్ అసోసియేషన్ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం, గుట్టల బేగంపేట పరిధిలోని సర్వే నెంబర్లు 12, 13లోగల ప్లాట్ల విషయంలో హైకోర్టు తుది తీర్పు వచ్చేవరకు తవ్వకాలు, నిర్మాణాలు, ఫెన్సింగ్ పనులను నిలిపివేయాలని అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా. సిహెచ్.సదానందం, నాగేంద్రకుమార్ మాట్లాడుతూ 1990-1992 మధ్య తమ సియెట్ సొసైటీ ప్రైవేటు పట్టా భూములను కొనుగోలుచేసి, ప్రణాళిక ప్రకారం కాలనీని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఆ రోజుల్లోనే హుడా అనుమతి పొందామని, దాని నిబంధనల ప్రకారం 80 అడుగుల రోడ్డును వేయడం జరిగిందని వారు తెలిపారు. కాగా 2016లో ముసాయిదా ఎఫ్‌టిఎల్ మ్యాప్‌లో సియెట్ సర్వే నెంబరు 12,13 ప్రాంతాలు చెరువు పరిధిలో చూపించారన్నారు. దీంతో 86 మంది ప్లాట్ల యజమానులకు తీరని అన్యాయం జరుగుతున్నదన్నారు. ఎన్‌జిటి సైతం సున్నం చెరువు అల్లాపూర్ గ్రామంలోని సర్వే నెంబరు 30లో 15 ఎకరాల 24 గుంటలు మాత్రమే ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్నదని తన అఫిడవిట్‌లో స్పష్టంగా పేర్కొందని వారు గుర్తు చేశారు. కాని హైడ్రా 2025లో ప్రారంభంలోనే కాలనీ ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉందంటూ తవ్వకాలు చేపట్టడం అన్యాయమని చెప్పారు. దీంతో కాలనీ వాసులు హైకోర్టును ఆశ్రయించగా ఆ ప్లాట్లలో ఎలాంటి పనులు చేపట్టరాదని, జనవరి 5న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ హైడ్రా తవ్వకాలను కొనసాగిస్తున్నదని ఆరోపించారు. హైకోర్టు తుది తీర్పు వెలువడేవరకు కాలనీలో యథాస్థితిని కొనసాగించాలని వారు సిఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు రాజు, రాజేంద్రప్రసాద్, శుభవాణి, రాధ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మాజీ కార్పొరేటర్ : దొడ్ల వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, మే 17, ప్రభాతవార్త : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గతంలో పాదయాత్ర చేసినప్పుడు రోడ్ల మీద పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలను తొలగించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని సిఎంసి అధికారులను ఆదేశించడం జరిగింది. అదే విషయన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, అధికారులతో మాట్లాడి ఎల్లమ్మబండలో ఉన్న చెత్త, మట్టిని తొలగించడం జరుగుతుందని వెంకటేష్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అన్ని కాలనీలలోని రోడ్లపై ఉన్న చెత్త, మట్టిని తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, తడిచెత్త పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని, చెత్తను నాలాలలో గాని, రోడ్లమీద గాని, చెరువులలో గాని వేయవొద్దని ప్రజలకు తెలియచేసారు. సిఎంసి సిబ్బంది కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రజలలో అవగాహన తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగేష్‌గౌడ్, ఎస్ఆర్‌పి నాగేశ్వరనాయక్, ఎస్ఎఫ్ఎ మల్లేష్, సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

లాలాపేటలో ఉచిత వైద్య శిబిరం

తార్నాక, మే 17 ప్రభాతవార్త : ప్రజా ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా బీజేపీ నాయకులు ఘర్ష మోహన్, ఘర్ష శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో లాలాపేట గడి స్కూల్‌లో ఘర్ష సాయిలు, నాగమణి జ్ఞాపకార్థం ఉప్పల్ టీఎక్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్ క్యాంపు, రక్తదాన శిబిరం నిర్వహించారు. డీసీ జ్యోతి, బీజేపీ నాయకులు వెంకటేష్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. శిబిరంలో పాల్గొన్న వైద్య నిపుణులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. అలాగే రక్తదాన శిబిరంలో పలువురు యువకులు రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల శ్రీనివాస్, ఘర్ష మోహన్‌రావు, మాడా ప్రమోద్ కుమార్, ఆకుల సంపత్, ఘర్ష శ్రవణ్ కుమార్, శశికాంత్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌నగర్ ఫేజ్ 2లో...

కెపిహెచ్‌బి కాలనీ, మే 17, ప్రభాతవార్త : బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ వారి సౌజన్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాకినేని వినోద్ యాకనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం వసంత నగర్ డివిజన్ భగత్ సింగ్ నగర్ ఫేస్2లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా తనవంతుగా సమాజానికి సేవ చేయాలనే మనతో ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, సాయి బాబు చౌదరి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, శ్రీనివాస్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సమ్మేళనం

హిందూ సమ్మేనంలో మాట్లాడుతున్న రాధాకృష్ణమనోహార్ దాస్

అత్తాపూర్ మే 17, ప్రభాతవార్త : హిందూ ధర్మం విశిష్టతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని రాధాకృష్ణ మనోహర్‌దాస్ పేర్కొన్నారు. రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి గ్రామంలో హిందూ సమ్మేళన ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, హరినామ సంకీర్తనలు, భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాధాకృష్ణ మనోహం దాస్, అన్నదాన సుబ్రహ్మణ్యం, ఆశా జోషి హిందూ ఐక్యత, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణపై ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.సమాజంలో యువత ధర్మం, సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. భక్తులకు మహా అన్నదానం నిర్వహించి ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హిందూ సమ్మేళన సమితి సభ్యులు, నాయకులు, హిందూ బంధువులు కుటుంబ సమేతంగా తరలివచ్చి పాల్గొన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలి

బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి

మ్యాన్‌హోల్స్‌లలో వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న మల్లారెడ్డి

అత్తాపూర్ మే 17, ప్రభాతవార్త : రాబోయే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను బిజెపి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదర్‌గూడ ప్రజల విజ్ఞప్తి మేరకు వాటర్ వర్క్స్ అధికారులతో నారగూడెం మల్లారెడ్డి మాట్లాడి ఆదివారం సిబ్బందిని పిలిపించి మ్యాన్‌హోల్స్‌లలో వ్యర్థాలతోపాటు ఇసుకను దగ్గరుండి తీయించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... వర్షాకాలం వస్తున్నందున డ్రైనేజీ మ్యాన్ హోల్‌లో నిండి ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసివేయాలని లేకుంటే డ్రైనేజీ నీళ్లన్నీ రోడ్లమీద ప్రవహిస్తాయని కావున చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కాకులారం కృష్ణ కిట్టు, హైదర్‌గూడ బస్తీ వాసులు మల్గారి బాలకృష్ణారెడ్డి, మల్గారి కొండల్ రెడ్డి, చెట్టిగారి సతీష్, సిబ్బంది నర్సింగ్, హరికృష్ణ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ

సికింద్రాబాద్, మే 17 ప్రభాతవార్త: ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయులకు అవసరమైన దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా స్కై ఫౌండేషన్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని మాట్లాడుతూ.. సమాజంలో నిరుపేదలు, అవసరంలో ఉన్న వారికి తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పిలుపునిచ్చారు. ఎలాంటి ఆసరా లేక రోడ్లపై కాలం వెళ్లదీస్తున్న వారికి తమ వంతు సాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిరాశ్రయుల ముఖాల్లో ఆనందం చూడటమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామకపత్రాలను అందజేస్తున్న శ్రీగణేష్

ఆత్మవిశ్వాసంతో జీవితాలను తీర్చిదిద్దుకోవాలి : ఎమ్మెల్యే

కంటోన్మెంట్, మే 17 ప్రభాతవార్త: నిరుద్యోగ యువతీ, యువకులకు ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో ఎంపికైన ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకొని ఆత్మవిశ్వాసంతో తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జామ్ మేళాలో టెక్ మహేంద్ర,విప్రో, టెలికాన్ఫరెన్స్,ఐటీ, హెల్త్ కేర్ వంటి యాభై ప్రముఖ కంపెనీల్లో ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సి.శ్రావణ్ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు, నాగేశ్ యాదవ్,శేఖర్ ముదిరాజ్,నర్సింగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం...

అడ్డగుట్ట, మే 17 ప్రభాతవార్త: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నేత బద్రి నాథ్ యాదవ్ అధ్వర్యంలో ఆదివారం మోండా డివిజన్‌లోని అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేశ్ యాదవ్,నర్సింగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే తలసాని

ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరిస్తున్న హాస్టల్ ఓనర్స్ ప్రతినిధులు

అడ్డగుట్ట, మే 17 ప్రభాతవార్త: హాస్టల్స్ నిర్వాహకుల సమస్యల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం అమీర్‌పేట హాస్టల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎస్.ఆర్.నగర్, బాపూనగర్, శివబాగ్‌కాలనీ, బికెగూడ ప్రాంతాల్లో 950 హాస్టల్స్ ఉన్నాయని, వాటిలో 50 శాతం విద్యార్థులు ఉన్నారని, హాస్టల్స్ భవన యజమానులు అద్దెలు పెంచడంతో నష్టం ఏర్పడుతుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. హాస్టల్స్ భవన యజమానులతో చర్చించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారామ్, ప్రతినిధులు రాజశేఖర్, తులసీ రామ్, శ్రీనివాస్, సురేశ్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం అయ్యేవరకు
పనులు నిలిపివేత : సెంట్రింగ్ కార్మికులు

మాట్లాడుతున్న సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అడ్డగుట్ట, మే 17 ప్రభాతవార్త: భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మిక శాఖ నుంచి శాశ్వత గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 10 ఫీట్లవరకు రూ. 51 చొప్పున అదనపు ఛార్జీలు చెల్లించాలని శ్రీరేణుకా సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ ఇ.రాము, అధ్యక్షులు ఎల్.మల్లేశ్, ప్రధాన కార్యదర్శి ఏ.లింగమయ్య, ఉపాధ్యక్షులు వి.శ్రీనివాస్, వైస్ చైర్మన్ బండ రాజులు తెలిపారు. ఆదివారం అడ్డగుట్టలో వారు మాట్లాడుతూ భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు,కార్మికుల న్యాయమైన కోర్కెల సాధనకు ఈ నెల 19న తుకారాంగేట్ చౌరస్తాలో దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుడికి ఇఎస్ఐ అసుపత్రిలో వైద్య సదుపాయం కల్పించాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి రూ.3 వేల పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. అదే విధంగా ఉచిత బస్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తూ మరణించిన భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు ప్రభుత్వం రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రభాకర్, ఎన్.స్యామ్‌సన్, నర్సింగ్ రావ్,రవి, రమేష్, గిరి, సురేశ్ పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో మళ్లీ అగ్నిప్రమాదం

ముషీరాబాద్, మే 17, ప్రభాతవార్త:

ముషీరాబాద్ నియోజకవర్గం, భోలక్‌పూర్‌లో మళ్లీ భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు కథనం ప్రకారం... ఆదివారం తెల్లవారుఝామున ఇందిరానగర్‌లోని ఒక కట్టెల స్క్రాప్ గోదాములో దట్టమైన పొగతో మంటలు ఎగిసి పడుతూ ఉండటంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆదివారం ఉదయం 10 గంటల వరకు శ్రమించి, మంటలను అదుపుచేశారు. అగ్ని వేడికి దాదాపు ఆరు ఇండ్లు పాక్షికంగా దెబ్బతినగా, స్థానిక నివాసి నరేష్ ఇంటి గోడలకు తగిలిన వేడికి, ఇంట్లోని టీవీ, ఫ్రిజ్‌వంటి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. కట్టెల గోదాం వ్యాపారి నిజాం సెంట్రింగ్‌కు ఉపయోగించే చెక్కలు, ప్యాకింగ్‌కు ఉపయోగించే కట్టెలు మొత్తం కాలి బూడిద అయ్యాయని, అగ్ని ప్రమాదం వల్ల దాదాపు 20లక్షల ఆస్థి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి అక్కడ జరిగిన ఒక ఫంక్షన్‌లో టపాసులు కల్చటం వల్లనే అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు. అగ్నిప్రమాదం గురించి, తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన వారి వివరాలను స్థానిక జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

అగ్నిప్రమాద స్థలిని పరిశీలిస్తున్న స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్

తాగునీటి సరఫరాను పెంచేవరకు ఉద్యమిస్తాం

బిఆర్ఎస్ నాయకులు

"వాక్ ఫర్ వాటర్"లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు కార్తిక్‌రెడ్డి, సీతారాం ధూళిపాళ తదితరులు

నార్సింగి, మే 17 ప్రభాతవార్త : మణికొండలో ఆదివారం బిఆర్ఎస్‌నాయకులు చేపట్టిన "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమానికి ప్రజలనుంచి విశేష స్పందన వచ్చింది. బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజేంద్ర నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వందలాది మంది కార్యకర్తలు, ప్రజలతో కలిసి నెక్‌నాంపూర్ చింతచెట్టు నుంచి మణికొండ మర్రిచెట్టు వరకు నీటి ఇబ్బందులు తొలగించాలని, పాత బకాయిలు మాఫీ చేయాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మంచినీటి కోసం అల్లాడిపోతుంటే కాంగ్రెస్ సర్కారు చేష్టలుడిగి చూస్తుందన్నారు. మణికొండలో నీటి సరఫరా సవ్యంగా లేక, ఇళ్లల్లోని బోర్లు ఎండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ట్యాంకర్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. నెలంతా కష్టపడి సంపాదించిన డబ్బంతా మంచినీటి కొనుగోలుకే పెట్టాల్సి వస్తుందని ఈ ప్రాంత ప్రజలు బాధపడుతున్నారన్నారు. ఎన్నికల వేళ ఓట్లు వేయించుకొన్న నాయకులు ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు పన్నుల వసూళ్లలో చూపిస్తున్నశ్రద్ధ ప్రజలకు మంచి నీటి సరఫరాపై పెట్టడం లేదని విమర్శించారు. సకాలంలో పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో అధికార గణం ఘోరంగా విఫలమైందన్నారు. అటు పాలకులు, ఇటు అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ దిగి వచ్చి ప్రజలకు మంచినీటి సరఫరాను పెంచేంత వరకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని కార్తిక్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ గండిపేట మండలంలోనే జంట జలాశయాలున్నా ఈ ప్రాంత ప్రజలు వేసవిలో మంచినీటి కోసం హరిగోస పడుతున్నారన్నారు. బిఆర్ఎస్ హయాంలో నిర్మించిన రిజర్వాయర్‌లు, వాటర్ ట్యాంక్‌లను ఉపయోగించుకొని నీటిని రాజధాని నగరానికి తరలిస్తే నీటి ఎద్దడి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. జల మండలి నీటిని సవ్యంగా సరఫరా చేయకపోవడంతో వాడుకునేందుకు నీరులేక వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సిన దుస్థితిలో తాము బతుకుతున్నామన్నారు. నేతలు, అధికారులకు ఈ సమస్యను పరిష్కరించాలని అనేకమార్లు కోరినా స్పందన కరువైందన్నారు. ఐదేళ్ల క్రితం బిల్లులను ఇప్పుడు కట్టాలని జలమండలి అధికారులు ప్రజలను దబాయించడం దారుణమని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఉపేంద్రనాథ్ రెడ్డి, అండే లక్ష్మణ్‌రావ్, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం కొత్త కమిటీ నేతలను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఆర్యవైశ్య సంఘం ఉప్పల్ కమిటీ ఎన్నిక

ఉప్పల్, మే 17 ప్రభాతవార్త: ఉప్పల్ ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటి సీనియర్ నేతలు బిక్కుమళ్ల సుధాకర్ గుప్త, రమేష్ గుప్త తదితరుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటిని ఎన్నుకుంటూ తీర్మానించారు. ఆర్య వైశ్య సంఘం నూతన కమిటి అధ్యక్షునిగా బిక్కుమళ్ల సంతోష్ గుప్త, ప్రధాన కార్యదర్శిగా పాలడుగు సంతోష్ గుప్త, కోశాధికారిగా రేణికుంట కిరణ్ గుప్త నియమితులైయ్యారు. ఆర్య వైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఆర్య వైశ్యులు సంఘటితంగా ఉండి సమస్యలు సాధించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధే లక్ష్యం : కిషోర్‌రెడ్డి

దుండిగల్, మే 17, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బహదూర్‌పల్లి డివిజన్ గ్రీన్‌హిల్స్‌కాలనీలో ఆదివారం నిర్వహించిన మార్నింగ్ వాక్ – బస్తీబాట కార్యక్రమంలో రాష్ట్ర ప్రొటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. కాలనీ అధ్యక్షులు ప్రజలతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన అక్కడి డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల పరిస్థితిని పరిశీలించారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ హిల్స్ కాలనీలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తాను ఖచ్చితంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బహదూర్‌పల్లి డివిజన్‌లోని ప్రతి కాలనీని ప్రతిరోజూ బస్తీబాట కార్యక్రమం ద్వారా సందర్శిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏఆర్ సాధు యాదవ్, వేణు కుమార్, ప్రవీణ్ ముదిరాజ్‌తో పాటు కాలనీ అధ్యక్షులు అమర్ పటేల్, దామోదర్, రాజిరెడ్డి, రాజశేఖర్, వీరన్న, బీరప్ప, చంద్రయ్య, శ్రీనివాస్, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

త్యాగరాయ గానసభ మానవీయ సేవలకు ప్రశంసలు

చిక్కడపల్లి, మే 17 (ప్రభాతవార్త) :

సంప్రదాయవాదులు అత్యంత శుభప్రదంగా భావించే వైశాఖ మాసంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ మరోసారి మానవీయత చాటుకుంది. కులమతాలకు అతీతంగా వివాహాలు చేసుకునే జంటలకు ఉచితంగా కళ్యాణ మండపాన్ని అందిస్తామని మూడు సంవత్సరాల క్రితం ప్రకటించిన గానసభ, ఈ ఏడాదీ ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకుంది. ఏప్రిల్ 29 నుంచి మే 13 వరకు గానసభ వేదికపై మొత్తం ఏడు వివాహాలు ఘనంగా నిర్వహించినట్లు గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వివాహం చేసుకున్న ప్రతి జంటకు వెండి కాలి మట్టెలు, బంగారు తాళిబొట్టు అందించడంతో పాటు, పెళ్లి వేడుకకు హాజరైన సుమారు 150 మంది అతిథులకు ప్రత్యేకంగా వివాహ విందును కూడా గానసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం శుభ మాసాల్లో కళ్యాణ మండపాల కొరతతో పాటు భారీ అద్దెల భారం కుటుంబాలకు ఇబ్బందిగా మారుతున్న తరుణంలో, గానసభ ఉచితంగా వేదికను అందించడం ఎంతో అపూర్వమని వివాహం జరుపుకున్న కుటుంబాల సభ్యులు పేర్కొన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసినా కళ్యాణ మండపాలు దొరకని పరిస్థితుల్లో, గానసభ అందించిన సహాయం తమకు జీవితాంతం గుర్తుండిపోతుందని వారు భావోద్వేగంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గానసభ పాలకవర్గ సభ్యుల సేవాభావం, మానవీయ దృక్పథం అభినందనీయమని పలువురు కొనియాడారు. సమాజంలో సామరస్యాన్ని పెంపొందించే ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో సంస్థలకు ఆదర్శంగా నిలుస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

మద్దాళి బాలసరస్వతి కన్నుమూత

కిన్నెర రఘురాంకు మాతృవియోగం

చిక్కడపల్లి, మే 17 (ప్రభాతవార్త) : ప్రముఖ ఆధ్యాత్మిక గురువు భగవాన్ రమణ మహర్షి ఆశీస్సులతో, ఆయన ఒడిలోనే బాల్యాన్ని గడిపిన ఆధ్యాత్మికమూర్తి, మహాభక్తురాలు, విశిష్టమహిళ మద్దాళి బాలసరస్వతి ఇకలేరు. ఆమెకు ఇద్దరు కుమారులు మద్దాళి రఘురాం, మద్దాళి శివరాం ఉన్నారు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిపట్ల ఆధ్యాత్మిక రంగ ప్రముఖులు, రమణాశ్రమ భక్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాలసరస్వతి గారి కుటుంబానికి భగవాన్ రమణ మహర్షితో ఎంతో దశాబ్దాల అనుబంధం ఉంది. చిన్నతనంలోనే రమణ మహర్షి సన్నిధికి చేరిన ఆమె, భగవానుడి వాత్సల్యాన్ని, అనుగ్రహాన్ని పొందిన అరుదైన భాగ్యశాలి. రమణ మహర్షి ఒడిలో కూర్చుని ఆడుకున్న రోజులను, ఆయన చెప్పిన సూక్తులను, అరుణాచల ఆశ్రమ జీవితాన్ని ఆమె తరచూ భక్తులతో పంచుకుంటూ ఉండేవారు. ఆమె మాటల్లో భగవానుడి లీలలు, ఆశ్రమ ముచ్చట్లు వినడం భక్తులకు ఒక గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని ఇచ్చేది. రమణ మహర్షిని ప్రత్యక్షంగా చూసి, ఆయన పర్యవేక్షణలో పెరిగిన చివరి తరం భక్తులలో బాలసరస్వతి ఒకరు. ఆమె మరణం రమణాశ్రమ చరిత్రలో ఒక శకం ముగిసింది. ఆమె భౌతికకాయాన్ని భక్తుల సందర్శనార్థం ఉంచారు. పలువురు ప్రముఖులు ఆమెకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె అంత్యక్రియలు ఆదివారం బాగ్ అంబర్‌పేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్.గోపి, ప్రస్తుత ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రసమయి సంస్థ అధినేత డాక్టర్ ఎం.కె.రాము, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్.జనార్దన మూర్తి పాల్గొన్నారు.

నూతన కమిటీలతో కాంగ్రెస్‌కు కొత్త ఊపు : కోట నీలిమ

సంజీవరెడ్డినగర్, మే 17, ప్రభాతవార్త: సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఎనిమిది డివిజన్లకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ప్రజలకు మరింత సేవా భావంతో పనిచేయాలని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ పిలుపునిచ్చారు. తాజాగా నియమితులైన డివిజన్ అధ్యక్షులు ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా అబ్బాస్‌షరీఫ్, బీకేగూడ అధ్యక్షుడిగా రవికాంత్, ఎస్ఆర్ నగర్ అధ్యక్షుడిగా దేవులపల్లి రవికిరణ్, అమీర్‌పేట్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్, బేగంపేట్ అధ్యక్షుడిగా మహమ్మద్‌నసీర్, రాంగోపాల్‌పేట్ అధ్యక్షుడిగా త్రికాల మనోజ్‌కుమార్, పద్మారావునగర్ అధ్యక్షుడిగా జగదీశ్, బన్సీలాల్ పేట్ అధ్యక్షుడిగా రమేష్‌బాబు నియమితులయ్యారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన డాక్టర్ కోట నీలిమతో పాటు సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్‌కు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తూ కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులను డాక్టర్ కోట నీలిమ శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో నూతన కమిటీల పాత్ర కీలకమన్నారు. ప్రతి డివిజన్‌లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ముందుండాలని కోరిన ఆమె, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేస్తే సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందన్నారు.

నూతన కమిటీల సభ్యులతో డాక్టర్ కోట నీలిమ

కొల్చారంలో మల్లినాథ సూరి సంస్కృత వర్సిటీని ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహకు రమణాచారి, భాషావేత్తల వినతి

కొల్చారంలో మల్లినాథ సూరి సంస్కృత వర్సిటీని ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, మే 17(ప్రభాతవార్త) : తొలి తెలుగు కవి, ప్రసిద్ధ వ్యాఖ్యాత మల్లినాథ సూరి పేరిట మెదక్ జిల్లా కొల్చారంలో సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని పలువురు భాషావేత్తలు, ప్రముఖులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ రమణాచారి ఆధ్వర్యంలో ఆచార్య కాసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య మాసన చన్నప్ప, సాధన నరసింహాచార్య, సంస్కృత భారతి అధ్యక్షుడు దర్భల ప్రభాకర శర్మ, మల్లినాథ సూరి కళా పీఠం అధ్యక్షుడు జి. వెంకట కవి సహా ముప్పై మందికి పైగా భాషావేత్తలు మంత్రిని కలిసి ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. మెదక్ జిల్లాలోని కొల్చారం మల్లినాథ సూరి స్వస్థలమని, ఆయన వారసులు, అభిమానులు అక్కడ విద్యాపీఠం ఏర్పాటు కోసం కొంత భూమిని కూడా కేటాయించారని ఈ సందర్భంగా వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ పరిధిలోనే ఈ స్థలం ఉందని, కాబట్టి అక్కడ మల్లినాథ సూరి సంస్కృత విశ్వవిద్యాలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ కె.వి.రమణాచారి తెలిపారు.

కమ్యూనిటీ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

నార్సింగి, మే 17 ప్రభాతవార్త: ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మణికొండ మాజీ ఫ్లోర్‌లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎంప్లాయిస్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నవసేవా సంకల్ప ట్రస్ట్ ఉచిత మెగా వైద్య శిబిరంను నిర్వహించింది. టిఎక్స్ ఆసుపత్రి వైద్య నిపుణులు ప్రజలకు జిఆర్‌బిఎస్, బిపి, షుగర్, బిఎంఐ, బిఎండి, ఇసిజి, కళ్లు, దంతాలు, చర్మం, జుట్టు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను, వైద్యులను అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, శ్రీరాములు, నవసేవా సంకల్ప ట్రస్టు ఛైర్మన్ మణి, ప్రధాన కార్యదర్శి మహేష్, కాలనీ ప్రతినిధులు మహ్మద్ అజార్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సాధించుకున్న ఫలాలు అందరికి అందేలా కృషి చేయాలి
ఎమ్మార్పీఎస్ నేతలు

సమావేశంలో పాల్గొన్న నేతలు

సికింద్రాబాద్, మే 17 ప్రభాతవార్త: హైదరాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశాన్ని ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టిపీ నరసింహ మాదిగ అధ్యక్షతన పార్సిగుట్ట ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పి రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజమ్ వెంకటస్వామి మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలితాలను మాదిగ జాతి విద్యార్థులు ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకునేలా వారికి అవగాహన కల్పించడం, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలకు నూతన కమిటీలు ఏర్పాటు, గ్రామ గ్రామాన నూతన గద్దె నిర్మాణాలను చేపట్టి జూలై 7 వరకు ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని మంద కృష్ణ మాదిగ గారి పిలుపుతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 50 రోజుల పాటు(మే 17 నుండి జూలై 7 వరకు) తీసుకున్న ఉద్యమ కార్యాచరణలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో "గో టు బస్తి" అనే నినాదంతో కార్యాచరణ తీసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిది దప్పు మల్లికార్జున్ మాదిగ, కిషన్, జులీ రాజు, అరుణ్ కుమార్‌లతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కవి రఘుశ్రీకి ఇట్కాలా సాహితీ పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి మే 17 (ప్రభాతవార్త) : ప్రముఖ అంతర్జాతీయ సంస్థ సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ ధర్మారావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ కవి రఘుశ్రీకి ఇట్కాలా సాహితీ పురస్కారం" ప్రదానం కార్యక్రమం జరిగింది. చేసి ఘనంగా సత్కరించారు. నల్లకుంటలోని వంశీ ఇంటర్నేషనల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి వంశీ ఇంటర్నేషనల్ సంస్థ అధినేత శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాన్ని అందించి ప్రసంగించారు. ఐదుదశాబ్దాలుగా మానస సాహితీ సంస్థ అధినేతగా, హైదరాబాద్ జంట నగరాల్లో అనేక కవి సమ్మేళనాలకు సంధానకర్తగా రఘుశ్రీ అందిస్తున్న సేవలు తెలుగు సాహిత్య వికాసానికి విశేషంగా దోహదపడుతున్నాయని కొనియాడారు. అధ్యక్షత వహించిన ఇట్కాలా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, సంస్కృతిరత్న డాక్టర్ కె. ధర్మారావు మాట్లాడుతూ రఘుశ్రీ దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి చేస్తున్న సేవలకు తాను ప్రత్యక్ష సాక్షి నని పేర్కొన్నారు. రైల్వే పెన్షనర్ల జాతీయ కార్మిక నేత సేవారత్న పి. యుగంధర్, సత్యసాయి మెడికల్ క్యాంపుల సంధానకర్త కె.వి.

ట్రాన్స్‌జెండర్లే లక్ష్యంగా అక్రమ దందా

అత్తాపూర్ మే 17, ప్రభాతవార్త : ట్రాన్స్ జెండర్లను టార్గెట్‌గా చేసుకుని అక్రమ దందాసాగిస్తున్న అత్తపూర్‌లోని హనీష్ హెయిర్ సెలూన్‌పై రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు చేసి నిర్వాహకుడు మోతానా అరెస్ట్ చేశారు. శరీర భాగాలు పెంచుతామని మాయమాటలు చెప్పి బ్యూటీ పార్లర్ నిర్వాహకులు ట్రాన్స్ జెండర్ల నుండి లక్షలు దండుకున్నారు. బ్యూటీ క్రీమ్ స్పెషల్ ఇంజెక్షన్ పేరుతో ప్రమాదకర ట్రీట్మెంట్లు అందించడం,వైద్య అర్హతలు లేకుండానే ట్రాన్స్ జెండర్లను లక్ష్యంగాచేసుకుని శరీర ఆకృతి మారుస్తామని, శరీర భాగాలు పెరుగుతాయని నమ్మబలికి అక్రమంగాఇంజెక్షన్లు, క్రీములు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మరికొంత మంది బాధితులను

మనిషిలోని భావాన్ని వ్యక్తపరిచేందుకే సంగీత సాహిత్యాలు

పద్మభూషణ్ వరప్రసాదరెడ్డి

మాట్లాడుతున్న వరప్రసాద్‌రెడ్డి

నాంపల్లి, మే 17 ప్రభాతవార్త : మనిషికుండే భావోద్వేగాన్ని ఒక భాషద్వారా మాట... వచన ప్రక్రియలు, పద్యం, గీతం ద్వారా తెలియపరచుకుంటారని, మనిషిలోని భావాన్ని వ్యక్తపరిచేందుకే సంగీత సాహిత్యాలని శాంతా బయోటెక్నిక్స్ ఛైర్మన్ పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి అన్నారు. ఎన్నిరకాల సంగీతాలున్నా సంగీతానికి పరమావధి, ఉద్దేశం ఒక్కటేనని, విషయాన్ని హృదయంలో నింపుకోవడానికి, మనస్సులోకి ఎక్కించుకోవడానికి ఉపకరించే సాధనం సంగీతమని, సాహిత్యానికి సంగీతం జోడిస్తే కలకాలం హృదయాల్లో నిలిచిపోతుంది. జానపదులకు పర్యాయమే లలితసంగీతమని, సున్నిత మనస్కులు, ప్రతీ విషయానికి కంపించిపోయేవాళ్లే కవిత్వం రాయగలరని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంతో సున్నిత మనసు, భావకవిత్వంలో నిష్ణాతులు డా. ఎం.కె.రాము అని ప్రశంసించారు. సమాజంపై దృష్టితో శ్వేచ్ఛాయుతులైన సాహితీవేత్తలు లలితగీత రచయితలని వరప్రసాదరెడ్డి అభివర్ణించారు. డా. ఎం.కె.రాము రచించిన వేలాది లలితగీతాల నుండి ఎంపికచేసిన 216 విలక్షణ గీతాలను ప్రముఖ సంగీత దర్శకులు స్వరపరచిన గేయాలను 50 మంది గాయనీగాయకులు, 50 మంది వాయిద్య కళాకారులచే లలిత సంగీతానికి పట్టాభిషేకం రెండవరోజు వైభవంగా విజయవంతమైంది. ప్రముఖ సాంస్కృతిక సాహితీ సంస్థ రసమయి ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో రెండురోజులపాటు ఉదయం 9నుండి రాత్రి 9గంటలవరకు నిర్విరామంగా కొనసాగిన ప్రముఖ కవి, లలితగేయ కళానిధి, రసమయి అధ్యక్షుడు బాలబంధు డా.ఎం.కె.రాము రచించిన 216 లలిత గీతాలతో జరిగిన లలిత సంగీతానికి పట్టాభిషేకం కార్యక్రమ ముగింపోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా.కె.ఐ.వరప్రసాదరెడ్డి, గౌరవ అతిథులు ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి, సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు, పి.వి.సాయిబాబా, గాయకుడు సంగీత దర్శకుడు కె.రామాచారి, అభినందన, కళారత్న ఎం.కె.ఆర్.ఆశాలత, సంస్థ అధ్యక్షుడు డా. ఎం.కె.రాముతో కలిసి జ్యోతి ప్రకాసనం చేసి ప్రసంగించారు. రెండురోజులపాటు 216 లలిత గీతాలను మధురంగా ఆలపించిన గాయకులను, సంగీతం సమకూర్చిన కళాకారు లను, ఇంతటి మహోన్నత యజ్ఞతుల్య కార్యక్ర మాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎం.కె. రామును అభినందించారు. చివరిగా అతిథుల చేతులమీదుగా డా. ఎం.కె.రామును ఘనంగా సత్కరించారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE-CUM CHIEF JUDICIAL MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT:: AT: KUSHAIGUDA.
O.S. NO. 238 OF 2026
Between:
Sri B. Chandra Sekhar and 3 others ... Plaintiffs
AND
1. The Tahsildhar, Uppal Mandal, Medchal-Malkajgiri District, Telangana State – 500039.
2. The Tahsildhar, Telkapally Mandal, Nagarkurnool District, Telangana State – 509385.
3. All Concerned ... Defendants
To,
All Concerned
Sir/Madam,
Whereas the above named Plaintiffs have filed the above suit seeking the declaration as legal heirs of late b. Bharatamma alias B. Bharathamma who died on 12-11-2025. Thereafter, all concerned are hereby requested to appear before the Hon'ble court at 10:30 A.M. on 12-06-2026 either in person or through Counsel duly instructed if you have any objection. Otherwise the matter will be heard and decided exparte in your absence.
SUIT SCHEDULE "A" PROPERTY
All that residential house bearing No.1-2-26 consisting of ground floor built area admeasuring 969 sft, land admeasuring 250 square yards or equivalent to 209 square meters on Plot No.3/1, in Survey No.173, situated at Lalithanagar Colony, Kothapet Village, Uppal Mandal, Medchal-Malkajgiri District, Telangana State and bounded by:
NORTH : Plot No.2, SOUTH : 25' Wide Road,
EAST : Plot No.3/3 of Lingamma and Janaiah,
WEST : Plot of Koteshwara Rao.
(By order of the Court)
S. VENKATESHWARLU,
K. HANMANDLU,
K. BHARATH KUMAR, Advocates,
Off: 2-3-512/B/111, 2nd Floor, Chenna Reddy Nagar, Amberpet, Hyderabad – 500013. Ph: 9849369366

సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

ఉప్పల్, మే 17 ప్రభాతవార్త:
ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం పావని శ్రీలత శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. ఈ సంద ర్భంగా రంగ పూజ, కొనుమిదే, సరస్వతి, పాహి రామప్రభు, తిల్లాన అంశాలను కళాకారులు నివ్రితి, ప్రజ్ఞశ్రీ, రీతిగా, నయనా, సువత్సశ్రీ, విముక్త, జస్మితా, శాన్వి, ద్యుతి, వేదం సంహిత, అభిజ్ఞ, శ్రావణి ప్రదర్శించి మెప్పించారు.

చిలుకానగర్ విద్యార్థిని రిషికి కాంగ్రెస్ నేత సత్కారం

ఉప్పల్, మే 17 ప్రభాతవార్త : తెలంగాణ ఎప్‌సెట్‌లో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థిని రిషిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ మల్లాడి కొండల్‌రెడ్డి కుమార్తె రుషి ఆదివారం ప్రక టించిన తెలంగాణ ఎప్‌సెట్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆమెను కలిసి సత్కరించినట్లు తెలిపారు. అనంతరం ములకలపల్లి రాజేష్‌ముదిరాజ్ రుషిని శాలువాతో సన్మానిం చారు. కాంగ్రెస్ పార్టీ నేతలు అమరేశ్వరి, నల్లవల్లి మహేందర్, మాచర్ల బలరాం, అమర్, సత్యం, సురేందర్, సమత, సుమలత, కిరణ్ పాల్గొన్నారు.

శ్రీశ్రీనగర్‌లో త్వరలో సిసి రోడ్డు పనులు : పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, మే 17 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ శ్రీశ్రీనగర్ కాలనీలో త్వరలో కొత్త సిసి రోడ్డు పనులు చేపడతామని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పలువురు కాలనీ నేతలు ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీనగర్‌కాలనీలో రోడ్డు సరిగా లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. గుంతల రోడ్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో పరమేశ్వర్‌రెడ్డి వెంటనే అధికారులతో చర్చించి సోమవారం నుంచే కొత్త సిసి రోడ్డు పనులు చేపడుతామని తెలిపారు. కాలనీలో ప్రజా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో శ్రీశ్రీనగర్ కాలనీ నేతలు అరుణ్ కిషోర్ కుమార్, ఎస్ నాగరాజు, భరత్ రాజ్ గౌడ్, అప్పన శ్రీనివాస్, మన్నె గిరిబాబు, రమేష్ కుమార్, వై సుధాకర్‌రావు, పి సత్యనారాయణ, డి.మల్లారెడ్డి, విద్య బుషన్, జి.అశోక్ గౌడ్, శంకర్ గౌడ్, అల్లె కృష్ణ, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సిఐ

ఉప్పల్, మే 17 ప్రభాతవార్త : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వారంరోజులుగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగింపు కార్యక్రమానికి సిఐ వై.రామ లింగారెడ్డి పాల్గొని ప్రసంగించారు. యువత రోడ్డు భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కేవలం చేతిలో హెల్మెట్ పట్టుకోవడం వల్ల ప్రయోజనం లేదని, మైనర్ విద్యార్థులు వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. డ్రగ్స్ వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 11 నుండి వారంరోజుల పాటు విద్యా వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించా మన్నారు. కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ వారం రోజుల కార్యక్రమాల నివేదికను సమర్పించారు. సమావేశ కన్వీనర్ డాక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ, టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులను సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డా.జె.విశ్వనాద్‌కుమార్, డాక్టర్ రాజశ్రీ, డాక్టర యమునా రాణి గీత, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రసాగర్, స్రవంతి, ఆర్. స్రవంతి, అనురాధ, సాయిలు, అరుణ, సూర్య పాల్గొన్నారు.

భావ గీత లహరి పేరిట లలిత సంగీత విభావరి

చిక్కడపల్లి, మే 17 ప్రభాతవార్త : కలగా కృష్ణమోహన్ స్వరకల్పనలో కలుషితం కాని సౌకుమార్యం, మట్టి వాసనతో కూడిన అమ్మతనం కనిపిస్తాయని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ ప్రశంసించారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై మోహన్ మెలోడీస్ ఆధ్వర్యంలో భావ గీత లహరి పేరిట లలిత సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవపెద్ది సురేష్ మాట్లాడుతూ కృష్ణమోహన్ కేవలం గీత రచన, స్వరకల్పనకే పరిమితం కాకుండా స్వయంగా ఆలపించగలరని, అందుకే ఆయనను 'వాగ్గేయకారుడు' అని పిలవవచ్చని పేర్కొన్నారు. నేటి సినీ సంగీతంలో వినసొంపు తక్కువగా ఉంటోందని, అయితే కృష్ణమోహన్ ఆ ధోరణిలో వెళ్లకుండా ఉత్తమమైన లలిత గీతాలను అందించడం అభినందనీయమన్నారు. ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. ఆకాశవాణిలో కృష్ణమోహన్ వంటి వారు మలి తరంలో లలిత గీతాలకు పట్టం కట్టారని వివరించారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు వినోద్ బాబు, గాయత్రి నారాయణన్, సందిత జ్యోతి లు ఒక్క మాటైనా చెప్పక ఎక్కడికి వెళ్లావు, రేయిలో మౌనంగా నడిచిపోతావు వంటి పలు గీతాలతో పాటు, అన్నిటికీ ఇది పరమౌషధము అనే అన్నమయ్య కీర్తనను శ్రోతలకు హృద్యంగా వినిపించారు. ఈ సభలో ప్రముఖ కథా రచయిత సుధామ, ప్రముఖ గాయని వికె.దుర్గ పాల్గొనగా, సింగింగ్ స్టార్, గాయని విజయలక్ష్మి వ్యాఖ్యానం ఆకట్టుకుంది.

ప్రతి గుండెకు చికిత్స అవసరం

చిక్కడపల్లి, మే 17 (ప్రభాతవార్త): ప్రపంచవ్యాప్తంగా గుండె సంబంధిత మరణాలకు ప్రధాన కారణమైన కరోనరీ ఆర్టరీ వ్యాధి చికిత్సలో అత్యాధునిక మార్పులు వస్తున్నాయని ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు డాక్టర్ మనోజ్ కుమార్ అగర్వాల్ పేర్కొన్నారు. ఆదివారం హృద్రోవైద్య చికిత్సలకు సంబంధించి అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ మనోజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ యాంజియోగ్రామ్‌లో అడ్డంకులు కనిపించిన ప్రతిసారీ స్టెంట్లు వేయాల్సిన అవసరం లేదని, రోగి పరిస్థితిని బట్టి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. యాంజియోగ్రామ్‌లో అడ్డంకులు కనిపించిన వెంటనే స్టెంటింగ్ అవసరమని భావించకూడదు. ధమనులు సన్నబడటం తక్కువగా లేదా మధ్యస్థంగా ఉన్నప్పుడు కేవలం ఔషధాల ద్వారా (ఆప్టిమల్ మెడికల్ థెరపీ) చికిత్స అందించవచ్చునని అన్నారు. రోగి లక్షణాలు, రక్త ప్రసరణ తీవ్రత, ఇతర ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని చికిత్సను నిర్ణయించాలి. చాలామందిలో జీవనశైలి మార్పులు, మందులు అద్భుతమైన ఫలితాలను ఇస్తాయని, స్టెంట్లు ఎప్పుడు అవసరం?: గుండెకు రక్త ప్రసరణ గణనీయంగా తగ్గినప్పుడు లేదా మందులు వాడుతున్నా లక్షణాలు తగ్గని పక్షంలోనే స్టెంట్లను సిఫార్సు చేస్తారన్నారు. ఆధునిక హృద్రోగ శాస్త్రం కేవలం రోగ నిర్ధారణకే పరిమితం కాకుండా, ప్రతి రోగికి వారి శారీరక స్థితిని బట్టి అత్యంత సముచితమైన మార్గాన్ని ఎంచుకోవడంపై దృష్టి పెడుతుంది. సరైన వైద్య పర్యవేక్షణలో యాంజియోప్లాస్టీ అత్యంత సురక్షి తం తెలిపారు.

ఆధ్యాత్మిక సేవా తత్పరులు, సంస్కృతి రత్న ధర్మారావు

చిక్కడపల్లి, మే 17 (ప్రభాతవార్త): ఆధ్యాత్మిక సేవాతత్పరులు, సంస్కృతి రత్న డాక్టర్ ధర్మారావు అని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం తిరువణ్ణామలై అరుణాచలేశ్వర మందిరానికి చెందిన ముగ్గురు అర్చక స్వాముల స్వీయ పర్యవేక్షణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ ధర్మారావును ఘనంగా సత్కరించి మాట్లాడారు. మతపరమైన కార్యక్రమాలతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ధర్మరావు చురుగ్గా పాల్గొంటూ, సమాజంలోని ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారన్నారు. నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ, భక్తి ప్రచారానికి ఆయన చేస్తున్న కృషికి నిదర్శనమని అన్నారు. ఆయన కేవలం ఆధ్యాత్మికవేత్త మాత్రమే కాకుండా, సామాజికంగా ఎంతో మందికి స్ఫూర్తినిచ్చే వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు చిరుతనగండల ఆంజనేయులు(గుంటూరు), చిరుతన గండల కోటేశ్వరరావు (బెంగళూరు) తదితరులు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య తెలుగు సత్సంప్రదాయ రీతిలో ప్రముఖ ఆధ్యాత్మిక సేవా మూర్తులు ఓంకార మూర్తి, శివకుమారి దంపతుల కుమార్తె లక్ష్మీ సౌమ్య, శ్రీహర్షల పవిత్ర బంధానికి ఈ వేడుక వేదికైంది. ఈ వేడుక అసాధారణ భక్తిభావంతో జరిగింది.

ప్రజల పక్షాన నిరంతరం పోరాడదాం

జీహెచ్ఎంసీ ఎన్నికలలో పూర్తి స్థాయిలో పోటీ.. తెలుగుదేశం పార్టీ సమావేశంలో తీర్మానం

మినీ మహానాడులో అభివాదం చేస్తున్న టీడీపీ నేతలు

ముషీరాబాద్, మే 17, ప్రభాతవార్త:
క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల పక్షాన నిరంతరం పోరాడ దామని మాజీ శాసన సభ్యురాలు కాట్రగడ్డ ప్రసూన పిలుపునిచ్చారు. ఆదివారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ విస్తృతస్థాయి ముఖ్యనాయకుల సమావేశం సీని యర్ నాయకులు నల్లెల్ల కిషోర్ అధ్యక్షతన, పి. బాలరాజ్‌గౌడ్ పర్యవేక్షణలో నిర్వహించారు. వందలాదిగా తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలతో పార్టీ కార్యాలయం పసుపుమయంగా మారిపోవటంతో పండుగ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సమావేశం ప్రారంభించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా మాజీ శాసన సభ్యురాలు కాట్రగడ్డ ప్రసూన హాజరై మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ చెక్కుచెదరలేదని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. పోలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ జూమ్ ద్వారా పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ సందేశం వినిపించగా, బక్కని నరసింహులు ఫోన్ ద్వారా లైవ్‌లో మాట్లాడారు. క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు జూమ్ ద్వారా మాట్లాడుతూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర పరిశీలకులుగా విచ్చేసిన శ్రీపతి సతీష్, పోలంపల్లి అశోక్‌లు మాట్లాడుతూ రానున్న రోజుల్లో నగరంలో పార్టీని సంస్థాగతంగా ఎలా బలోపేతం చేయాలో దిశా నిర్దేశం చేశారు. సమావేశం అనంతరం కీలక తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కాంగ్రెస్‌ల వైఫల్యంతో స్తబ్దత ఏర్పడిందని, ప్రజలు తెలుగుదేశం పార్టీ తిరిగి రావాలని ఆశగా ఎదురు చూస్తున్నారని, పార్టీని బలోపేతం చేసి, ప్రజల పక్షాన నిరంతరం పోరాడాలని తీర్మానించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలలో టీడీపీ పూర్తి స్థాయిలో అభ్యర్ధులను నిలబెట్టి, పోటీ చేయాలని తీర్మానించారు. హైదరాబాద్ మహానగరానికి ఐటీ వైభవాన్ని, అంతర్జాతీయ స్థాయిలో వసతులను కల్పించిన నారా చంద్రబాబునాయుడేనని, హైదరాబాద్ నగరాభివృద్ధి మరింత వేగవంతంగా జరగాలంటే టీడీపీ గెలుపు అత్యంత ఆవశ్యకమని తీర్మానించారు. కేంద్ర నామినేటెడ్ పదవుల్లో తెలంగాణ సీనియర్ నాయకులకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మే 28న ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు అజ్మీర రాజునాయక్, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ విద్యాసాగర్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్, హైదరాబాద్ నాయకులు నాగు నగేష్, అన్వర్, సికింద్రాబాద్ నాయకులు వల్లారపు శ్రీనివాస్, జూబ్లీహిల్స్ నాయకులు జివిజి నాయుడు, ఆర్.మహేందర్‌యాదవ్, సుదర్శన్‌రెడ్డి, తడక వినోద్‌నేత, గుట్ట అనిల్‌కురుమ, శ్యాంసుందర్, కిరణ్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్

ఘనంగా హరేకృష్ణ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం

-ముఖ్యఅతిథిగా హాజరైన జయేష్ రంజన్

హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త: నార్సింగి సెంట్రల్ కిచెన్‌లో హరేకృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవంతో పాటు, 15 కోట్ల సమిష్టి భోజనాల పంపిణీ పూర్తి చేసుకున్న సందర్భాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరై, వంటశాల సామర్థ్యాన్ని పెంచే ఆధునిక పరికరాలను ప్రారంభించారు. ఫౌండేషన్ సాధించిన ఈ మైలురాయిని ఆయన అభినందించారు. వంటశాల మొత్తం కార్యకలాపాలను గౌరవ అతిథులకు నిర్వాహకులు వివరించారు. ఆధునిక సాంకేతికతతో సమర్థవంతం గా నిర్వహిస్తున్న వంట ప్రక్రియలను, సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ డిజైన్ బృందం రూపొందించిన ఆటోమేటెడ్ దోసె తయారీ యంత్రం, వెసెల్ సీలింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం వంటశాల సిబ్బంది వాలంటీర్లతో ముచ్చటించి, సమాజ సేవలో వారి అంకితభావాన్ని అభినందించారు.

పోషకాహార పంపిణీ ద్వారా సమాజానికి సేవలందిస్తున్న ఫౌండేషన్ కృషిని ఆయన ప్రశంసించారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులు అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షులు శ్రీమాన్ సత్య గౌర చంద్ర దాస సారథ్యంలో జరిగిన ఈకార్యక్రమంలో అరబిందో ఫార్మా డైరెక్టర్ డా. ఎం. శివ కుమారన్, అదనపు కమిషనర్ బడావత్ సంతోష్, ఎన్. రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సిఎంఆర్ఎఫ్ వరం

తలకొండపల్లి, మే 17, ప్రభాతవార్త: నిరుపేదలకు సిఎంఆర్ఎఫ్ (సిఎం రిలీఫ్‌ఫండ్)చెక్కులు వరం లాంటిదని లింగారావు పల్లి సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగారావు పల్లి గ్రామానికి చెందిన వల్లింపుల యాదయ్య అనారోగ్యానికి గురై కార్పొరేటు ఆసు పత్రిలో డబ్బులు ఖర్చు చేశారు. పేదవాడు కావటంతో ఖర్చులు భరించకపోయారు. దీంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో ఆసుపత్రి ఖర్చులు సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు చేశారు. ఆదివారం మంజూరు ఐన చెక్కును యాదయ్యకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమములో సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి, బాల్ రెడ్డి, అంజిరెడ్డి, భాస్కరరెడ్డి, యల మందరెడ్డి, ప్రతాపరెడ్డిలు ఉన్నారు.

ఎప్ సెట్‌లో షాద్‌నగర్ విద్యార్థుల సత్తా

షాద్‌నగర్, మే 17, ప్రభాతర్త : తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎప్ సెట్ 2026 ఫలితాలలో బైపిసి స్ట్రీమ్‌లో షాద్ నగర్ విశ్వభారతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఫలితాలలో ఈ కళాశాల విద్యార్థి ఎం. సుశాంక్ రెడ్డి రాష్ట్రస్థాయిలో 710 వ ర్యాంకులు సాధించి కళాశాల కీర్తిని పెంచాడు. అదేవిధంగా మరో నలుగురు విద్యార్థులు గౌరవ సింగ్ 5789, టి.సోనీ 9709, జునైరా మెహ్విష్ 9935, ఎం. అక్షి త 10259 ర్యాంకులను సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ శివకుమార్ తో పాటు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

విద్యాతోనే మెరుగైన సమాజం

ప్రముఖ సంఘ సేవకులు నక్కా శ్రీనివాస్ యాదవ్

చార్మినార్, మే 17 ప్రభాతవార్త : విద్య ద్వారానే మెరుగైన సమాజం ఏర్పడటం, దేశ ప్రగతి సాధ్యమవుతుందని ప్రముఖ సంఘ సేవకులు నక్కా శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సిటీ కళాశాలలో ఆదివారం జరిగిన విద్యా వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నిబద్ధతతో కృషి చేసి సిటీ కళాశాలకు దేశంలోనే అత్యున్నత గ్రేడ్ తీసుకురావటంలో అధ్యాపకు లందరూ కృషి చేశారని ఆయన అభినందించారు. విద్యార్థులు ప్రమాదకరమైన వ్యసనాలు బారిన పడకుండ తల్లిదండ్రులు, అధ్యాపకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో అత్యున్నత ప్రతిభ కనపరిచిన ఇలియాస్, మణి కంఠ, గఫార్, విష్ణు, వంశీ, కళాశాల పూర్వ విద్యార్థినీ ఎం.అపర్ణలను ప్రిన్సిపాల్, అధ్యాపకబృందం సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ ప్రకాష్, స్వర్ణలత, సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.ప్రసాద్, పి.రతన్‌కుమార్ డా.కె.పర్వతాలు, డా.ఎల్.తిరుపూతి, కళాశాల ఐక్యూయేసీ కో ఆర్డినేటర్ ప్రొ. జె.నీరజ, ప్రొఫెసర్లు శాంతి, శంకర్ కుమార్, రాజంద్రకుమార్, కోయి కోటీశ్వరరావు, నైన వినోదినీ, డా.శ్రీదేవి, డా.శ్రీనివాస్, డా.శారద, డా.శ్రీనివాస్‌రెడ్డి, డా.వాసేదేవరెడ్డి, డా.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జిల్లేడు చౌదరిగూడ, మే 17, ప్రభాతవార్త: జిల్లెడ్‌చౌదరిగూడ లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బిఆర్ఎస్ నాయకులు ఆదివారం పంపిణీచేశారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. మం దలం లోని ఇంద్రనగర్ గ్రామానికి చెందిన మొరంబాయి శ్రీనుకు రూ. 27వేలు, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బంగారు రాములమ్మకు రూ.24,500, వనంపల్లి గ్రామానికి చెందిన కావాలి సునీతకు రూ 15వేలు, సభవత్ శ్రీనుకు రూ.27వేలు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.

లిక్కర్ రాణి వాస్తవాలు తెలుసుకోవాలి..

తలకొండపల్లి, మే 17, ప్రభాతవార్త : మాజీ మంత్రి టీ.హరీష్ రావుపై కల్వకుంట్ల కవిత చేసిన విమర్శలు మానుకోవాలని బిఆర్ఎస్ మండల నాయకులు విజయకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం తలకొండపల్లి మండల పరిధిలోని జులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవిత మతి స్థిమితం లేకుండా మాట్లాడుతున్నారన్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీళ్లు రాలేదని విమర్శించటం అర్ధరహితమన్నారు. భూగర్భ జలాలు పెరగటంతో రైతులు రెండు నుండి మూడు పంటలు పండించుకోగలుతున్నారని పేర్కొన్నారు. లిక్కర్ దందాలో మునిగి తేలిన లిక్కర్ రాణికి క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలియవని.. రాజకీయ భవిష్యత్‌ను ఇచ్చిన తండ్రిని లెక్కచేయని కవితకు తెలంగాణా ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

మహా ధర్నా కరపత్రాలను విడుదల చేస్తున్న ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులు

ప్రతి కార్యకర్త అంకితభావంతో పోరాడాలి

షాద్‌నగర్, మే 17, ప్రభాతవార్త : గిరిజన హక్కుల సాధన కోసం ప్రతి గిరిజన నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పోరాడాల్సిన అవసరం ఉందని ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ అన్నారు. ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా ధర్నాకు సంబంధించిన హైదరాబాద్ మహాధర్నా పేరిట కరపత్రాలను ఆదివారం పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మహాధర్నాను విజయవంతం చేయాలని నేతలను, కార్యకర్తలను, గిరిజన ప్రజలను కోరారు. తాలూకా అధ్యక్షుడు పాతావత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన న్యాయ కార్యదర్శి చందర్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ఉమ్లా నాయక్, కార్యదర్శి మోహన్, యువజన అధ్యక్షుడు సంజు నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు అయోధ్య శ్రీనివాస్, ఆరు మండలాల అధ్యక్షులు రాము నాయక్, బాబు నాయక్, సంతోష్ నాయక్, రాజు నాయక్, గోపాల్ నాయక్, రామ్ చరణ్ నాయక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యాదవ సంఘం ఆదర్శం అభినందనీయం



పూడూర్‌లో యాదవ సంఘం భవనం ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, మే 17. ప్రభాతవార్త : యాదవులు నిజాయితీకి మారుపేరు అని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన యాదవ సంఘం భవనాన్ని ఆదివారం సంఘం అధ్యక్షులు తోకల లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు నీతి, నిజాయితీగా ఉంటారని, నమ్మిన వారికి ఎల్లవేళలా అండగా నిలుస్తారని తెలిపారు. తాను గతంలో యాదవ సంఘం భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించగా సద్వినియోగం చేసుకుని భవనాన్ని నిర్మించుకోవడం సంతోషకరమని అన్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో యాదవ భవనం కోసం అడిగిన వెంటనే ఎమ్మెల్యే మల్లారెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించినందుకు దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ భాస్కం యాదవ్, ఎల్లంపేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, గ్రామ మాజీ సర్పంచ్ బాబుయాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు నవీన్‌రెడ్డి, కౌన్సిలర్ నిశిత, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్ యాదవ్, సుదర్శన్, బాలు, రఘుపతిరెడ్డి, హరత్‌రెడ్డి, గ్రామ నాయకులు పోచయ్య, సత్తిరెడ్డి, కోల్ల వెంకటేష్, క్రిష్ణ, సోమేశ్ యాదవ్, హన్మంత్‌రెడ్డి, శశికుమార్, శ్రీకాంత్, యాదవ సంఘం సభ్యులు శ్రీశైలం యాదవ్, సాయికుమార్, వేణుయాదవ్, వెంకటేశ్, సుదర్శన్, క్రిష్ణ, మహేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాన్ని కాపాడండి

అందజేశారు. పూడూర్ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేను కలిసి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 608లో గల స్థలంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని స్థలాన్ని ఇతరులకు ఇవ్వకుండా క్రీడలకు కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌యాదవ్, ప్రవీణ్, ప్రశాంత్, నిఖిల్, పరమేశ్, శ్రీనివాస్, శివ, సాయి, ప్రతాప్, మధు, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోహెడ చంద్రమౌళి

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను ఏకమొత్తంగా చెల్లించాలి

రాష్ట్ర అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి

మలక్‌పేట, మే 17, ప్రభాతవార్త: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను ఏక మొత్తంగా చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. మార్చి 2024 నుండి రిటైరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసుకున్న రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల స్టీరింగ్ కమిటీ సమావేశం ఆదివారం ముసారాంబాగ్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. మార్చి 2024 నుండి రిటైర్ అయిన రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 2024 మార్చి నుంచి ఇప్పటివరకు 25 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు రిటైర్‌కాగా వారికి రావాల్సిన జిపిఎఫ్, టిఎస్జిఎల్ఐ, జిఐఎస్, లీవ్ ఎన్‌కాష్‌మెంట్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ, పిఆర్సి, ఎరియర్స్ తదితర బకాయిలను ఏకమొత్తంగా చెల్లించాలన్నారు. రాష్ట్ర నూతన కార్యవర్గ అధ్యక్షులుగా కోహెడ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా కొంపల్లి భిక్షపతి, అసోసియేట్ అధ్యక్షులుగా కందుకూరి దేవదాసు, ట్రెజరర్‌గా గంధ్ర రవీందర్‌రావు, గౌరవ అధ్యక్షులుగా బి.సత్యనారాయణ అడిషనల్ జనరల్ సెక్రెటరీ జె.వెంకటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శుల ఎన్నికయ్యారు

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి : బసవరాజు శ్రీనివాస్

ఎల్.బి.నగర్, మే 17 ప్రభాతవార్త: బ్రాహ్మణుల సంక్షేమానికి బ్రాహ్మణ పరిషత్ కృషి చేస్తుందని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ న్యూమారుతినగర్‌లోని బాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ అధ్యక్ష ప్రధానకార్యదర్శి వై.భవాని, వైష్ణవిప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీపాద తెలంగాణ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్‌చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్‌లను వారు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద బ్రాహ్మణులకు ఆర్థిక, విద్యా. వైద్య సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు. తెలంగాణలో బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీకి 100కోట్ల నిధులు సమకూర్చే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సొసైటీకి నేను కూడా నిధులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ ప్రధానకార్యదర్శి పెండ్యాల శేషసాయి వరప్రసాద్, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు తులసిశ్రీనివాస్, జనార్దన్ మూర్తి, వక్కలంక శ్రీనివాస్, దుద్దు సుబ్రహ్మణం, వారణాసి వంశీ, చైతన్యపురి మాజీ కార్పొరేటర్ రంగ నర్సింహగుప్త, పప్పు వెంకట్, కర్రా మూర్తి, ఆంజనేయులు, అబ్బుర్, పటేల్ పాల్గొన్నారు.

రక్షణ పరిశోధన రంగంలో విశేష కృషి చేసిన

గొప్ప శాస్త్రవేత్త డాక్టర్ చంద్రమౌళి : విజయ్ కుమార్

చిక్కడపల్లి, మే 17 (ప్రభాతవార్త) : మూడు దశాబ్దాలకు పైగా రక్షణ పరిశోధన రంగంలో విశేష కృషి చేసిన గొప్ప శాస్త్రవేత్త డాక్టర్ జి.చంద్రమౌళి అని నవ్య నాటక సమితి అధినేత వేమరాజు విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆకాష్ క్షి పణి శాస్త్రవేత్త డాక్టర్ జి. చంద్రమౌళికి ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.చంద్రమౌళి సతీమణి సీత కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమరాజు విజయ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పర్యవేక్షణలో ఐజీఎండీపీ కార్యక్రమంలో భాగంగా ఆకాష్ క్షి పణి వ్యవస్థ రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సన్మాన గ్రహీత డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ నవ్య నాటక సమితి చేస్తున్న సాంస్కృతిక సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమౌళి సతీమణి సీత, కుటుంబ సభ్యులు, నవ్య నాటక సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి

బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్

చిక్కడపల్లి, మే 17 (ప్రభాతవార్త) : కేంద్ర ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనమే పెట్రోల్ డీజిల్ ధరల పెంపుకు కారణమని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత 12 సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం దేశాన్ని పూర్తిగా ఆర్థిక సంక్షోభంలోని నెట్టిందన్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆధిపత్య కార్పొరేట్ ఆర్థిక విధానాల వల్ల దేశంలో ద్రవ్యోల్బణం లోటు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక భారంతో కూరగాయలు, పెట్రోల్, గ్యాస్, ఇల్లు అద్దెలు చెల్లించాలేని దుస్థితి ఏర్పడిందన్నారు. పెద్ద నోట్ల రద్దుతో దేశంలో లక్షలాది చిన్న మధ్యతరహా పరిశ్రమలు మూతపడి కోట్లాదిమంది మంది చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారని దండి వెంకట్ తెలిపారు. పెట్రోలు డీజిల్ ఉత్పత్తులను రష్యా, ఇరాన్ ల నుండి కొనుగోలు చేయవద్దని అమెరికా యుద్దోన్మాది ట్రంప్ ఆదేశాలకు కేంద్ర బిజెపి ప్రభుత్వం తలవంచడం వల్లే దేశ ప్రజలు భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని దండి వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రజలను త్యాగాలకు సిద్ధం కావాలని చెపుతున్న మోదీ ప్రభుత్వం ప్రభుత్వ బ్యాంక్ లను లూటీ చేసి విదేశాలకు పారిపోయిన దొంగల లక్షల కోట్ల రూపాయల కక్కిస్తే ప్రజలు ఏ త్యాగాలు చేయాల్సిన అవసరం లేదన్నారు.

డివిజన్ కార్యకర్తలకు సర్‌పై అవగాహన సదస్సు

చిక్కడపల్లి, మే 17(ప్రభాతవార్త) : అడిక్ మెట్ డివిజన్ పరిధిలోని బీజేపీ కార్యకర్తలకు సర్ అంశంపై ఆదివారం స్థానిక డివిజన్ అధ్యక్షులు పాశం సాయికృష్ణ యాదవ్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాశం సాయికృష్ణ యాదవ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పని చేసేటప్పుడు, ముఖ్యంగా డివిజన్ కార్యకర్తలు సర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన పలు జాగ్రత్తలను, అనుసరించాల్సిన వ్యూహాలను కార్యకర్తలకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు కె. రాజ్ కుమార్, జి. జనార్దన్ రెడ్డి మరియు డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై పునరాలోచించాలి

తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు శివరాత్రి అయిలి మల్లు

ధర్నాచౌక్, మే 17, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై పునరాలోచించాలని తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు శివరాత్రి అయిలి మల్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్, ఆధ్వర్యంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పేరును తక్షణమే మార్చాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయిలి మల్లు మాట్లాడుతూ గుంజరేణుకను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకటించిందని, ఆమెకు వడ్డెర సమస్యలపై ఎటువంటి అవగాహన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి, వడ్డెర సమస్యలపై పూర్తిగా అవగాహన ఉన్న వారిని చైర్మన్‌గా ప్రకటించాలని, లేనిపక్షం సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో వడ్డెర సంఘం కార్మిక విభాగం ఉపాధ్యక్షులు కే.అంజయ్య, వడ్డెర సంఘం నేతలు ఎత్తరి గణేష్, గుర్రం శ్రీనివాస్, బిక్షం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు